KSR02B172

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన్ 18, 2017
స్నేహ

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం

గాన గంధర్వుడు





తొలి నేస్తం నాన్న...

తొలి అడుగులు నేర్పే తొలి నేస్తం నాన్న...అలాంటి నాన్న ప్రేమని చాటిన బాలీవుడ్ చిత్రాలెన్నో గొప్ప చిత్రాలుగా నిలిచిపోయాయి.. నిజ జీవితంలోనే కాదు సినీ పాత్రల్లోనూ కాస్త కటువైన పాత్రలో కనిపించేది నాన్నే.. పిల్లల మంచి భవిష్యత్తుకు పరితపించే తండ్రి పాత్రలో 'వక్త్' చిత్రంలో ప్రేక్షకులని మెప్పించారు బిగ్‌బి. బాలీవుడ్‌లో నాన్న పాత్రల్లో ఎక్కువగా నటించిన వ్యక్తి అనుపమ్ ఖేర్. తండ్రి పాత్రలో అనుపమ్ నటించిన చిత్రాలు వందకుపైనే. అయితే 'వేకప్ సిద్' తనకి మంచి పేరుతెచ్చిపెట్టిన చిత్రం. 'దిల్ ధడక్‌నే దో' చిత్రంలో అనిల్ కపూర్ తండ్రి పాత్రలో వైవిధ్యభరితమైన నటన కనబరిస్తే, కుచ్ కుచ్ హోతాహైలో సింగిల్ పేరెంట్ పాత్రలో నాన్న మనసుని మన కళ్ళముందుంచాడు షారుక్. నాటి 'మొఘల్ ఏ ఆజామ్' నుంచి 'మాసూమ్', 'అప్నే, 'పాటియాలా హౌస్', 'అకేలే హమ్ అకేలే తుమ్' కుచ్ కుచ్ హోతా హై', 'డియర్ డ్యాడ్', 'పా' ఇలా ఒక్కో చిత్రం తండ్రి ఔదార్యాన్ని కళ్ళకుకట్టినట్టు చేశాయి. ఈ మధ్య విడుదలైన 'దంగల్' తండ్రి గొప్పతనాన్ని మరింత గొప్పగా తీర్చిదిద్దిన చిత్రం.



కథా నిలయం
ENTERED
KSR02B172

విజేత

గ్రాండ్ ప్రిక్స్‌లో సిక్స్ కొట్టాడు

ఫార్ములా వన్ రేస్‌లో ముందుండే పేరు లెవీస్ హామిల్టన్. ముప్ఫై ఏళ్ల వయసుకే మూడు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లతో రయ్యిమంటూ కెరీర్‌లో దూసుకెళుతున్నాడు. ఇటీవలే ప్రపంచ నెం.1 రేసర్ స్థానానికి చేరుకున్నాడు. అది కూడా రికార్డు విజయాలతో. ప్రతి సీజన్లో కనీసం ఒక గ్రాండ్ ప్రిక్స్‌నైనా గెలిచే ఒకేఒక్కడిగా పేరు సంపాదించాడు. మిగతా క్రీడాభిమా నుల చూపుల్ని కూడా రేసింగ్ ట్రాక్ వైపు తిప్పుతోన్న ఈ విజేత కథ ఈ వారం.

అంతర్జాతీయ అరంగ్రేటం చేసి పదేళ్లు కూడా నిండకముందే లెవీస్ హామిల్టన్ ఆల్ టైమ్ రేస్ విజయాల రికార్డు (56)తో 2,376 కెరీర్ పాయింట్లను దక్కించుకున్నాడు. వేర్వేరు సర్క్యూట్లలో 24 విజయాలు, 65 సెకండ్ మోస్ట్ ఆల్-టైమ్ రికార్డు పోల్ పొజిషన్లతో అరుదైన, చరిత్రలోనే అత్యంత గొప్ప ఫార్ములా వన్ డ్రైవర్లలో ఒకడిగా నిలిచాడు. హామిల్టన్ జనవరి 7, 1985న స్టెవెనేజ్లో జన్మించాడు. అమెరికా స్ప్రింటర్ కార్ల్ లెవీస్ పేరు మీద హామిల్టన్‌కు ఈ పేరు పెట్టారు. అతని తల్లి కార్మెన్ లార్‌బాలెస్టియర్ బ్రిటిష్ పౌరురాలు. అతని తండ్రి తరపు తల్లిదండ్రులు 1950 దశకంలో గ్రెనడా నుంచి యునైటెడ్ కింగ్‌డమ్‌కు వలస వెళ్లారు. హామిల్టన్‌కు రెండేళ్లుండగా తల్లిదండ్రులు విడిపోయారు. 12 ఏళ్ల వయస్సు వరకు తల్లి వద్ద పెరిగాడు. ఆ తర్వాత తండ్రి వద్దకు వచ్చాడు. రేడియో ఆధారిత కార్లతో ఆడుకుంటున్నప్పుడు అతనికి మొదటిసారిగా రేసింగ్ పోటీలపై ఆసక్తి ఏర్పడింది. అతని తండ్రి 1991లో ఓ కారు కొనిచ్చాడు. తరువాతి ఏడాదే హామిల్డన్ జాతీయ బ్రాసా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ఏకంగా రెండో స్థానంలో నిలిచి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. అప్పుడు అతనికి ఆరేళ్ల వయస్సు. క్రిస్మస్ కానుకగా గో- కార్ట్‌ను తండ్రి కొనిచ్చాడు. బడిలో బాగా చదువుకున్నంత కాలం నీకు నేను మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చాడు. కొడుకు ఇష్టపడుతున్న క్రీడా రంగంలో నిలదొక్కుకోవడం అంత తేలిక కాదని తండ్రికి తెలుసు. డబ్బు చాలా ఖర్చు పెట్టాలి. అలాగే అవకాశాల కోసం చాలా కష్టపడాలి. అందుకు తాను పూర్తిగా రంగంలోకి దిగి లెవీస్ కెరీర్‌ను దగ్గరుండి మలిచాడు. ఐటి మేనేజర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి ఓ కాంట్రాక్టరుగా మారాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్నిసార్లు తండ్రి మూడేసి ఉద్యోగాలు చేయాల్సివచ్చింది కూడా. జాన్ హెన్రీ న్యూమ్యాన్ స్కూల్‌లో చదివే రోజుల్లోనే హామిల్టన్ ఫుట్‌బాల్ ఆటలోను ప్రతిభ చూపాడు. అటువైపుగా మరల్చాలని కోచ్‌లు కూడా ప్రయత్నించేవాళ్లు. క్రికెట్‌లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని రేస్ ట్రాక్ నుంచి దూరం జరిగే విషయంపై కూడా తీవ్ర ఆలోచనే చేశారు. కానీ అతడికి వేగం ఇచ్చిన ఉత్తేజం మరేమీ ఇవ్వలేదు.



మిగతా క్రీడల్లో ఎంత నైపుణ్యమున్నా థ్రోటల్ పట్టు పడితే కానీ సంతృప్తి ఉండేది కాదు. అలా పూర్తిగా రేసింగ్‌లపైనే దృష్టిపెట్టాడు. ఫుట్‌బాలరో లేదా క్రికెటరో అయ్యే వాడేమో ఫార్ములా వన్ రేస్‌తో తిరుగులేని శక్తిగా అవతరించాడు. యువకుడిగా ఉన్నప్పుడు అతను రెండు క్రీడల పాఠశాల జట్లలోను ఆడాడు. కార్ట్ రేసింగ్‌లో పాల్గొనేపుడు హామిల్టన్ ఎక్కడ ఉన్నాడో తేలిగ్గా గుర్తు పట్టేందుకు పసుపు రంగు హెల్మెట్‌ను తగిలించేవాడు తండ్రి. అదే రంగు ఫార్ములా వన్ రేస్‌లకు వాడుతున్నాడు.

అతి పిన్నవయస్కుడు...

హామిల్టన్ 1993లో ఎనిమిదేళ్ల వయస్సులో రైయ్ హౌస్ కార్ట్ సర్క్యూట్‌లో కార్టింగ్ ప్రారంభించాడు. త్వరగానే రేసులు గెలవడం, కాడెట్ క్లాస్ ఛాంపియన్‌పిష్‌ల్లో విజయం సాధించడం మొదలెట్టాడు. పదేళ్ల వయస్సులోనే అతను మెక్ లారెన్ ఎఫ్‌వన్ జట్టు అధిపతి రోన్ డెన్నిస్ ఆటోగ్రాఫ్‌ను తీసుకునే సందర్భంలో "నేను బ్రిటిష్ ఛాంపియన్‌షిప్ గెలిచాను. ఏదో ఒక రోజు నేను మీ కార్లతో రేసింగ్‌లో పాల్గొనాలనుకుంటున్నాను." అని అనేసరికి ఆశ్చర్యపోయాడు డెన్నిస్. ఆ యువకుడిలోని పట్టుదల, ఆత్మవిశ్వాసం, సంకల్ప బలం బాగా నచ్చేశాయి. 'దీనిపై తప్పకుండా కలుద్దాం...' అంటూ డెన్నిస్ భరోసా ఇచ్చాడు. కాడెట్ ర్యాంకుల నుంచి జూనియర్ యమహా (1997) ద్వారా హామిల్టన్ ఎదగడం మొదలెట్టాడు. బ్రిటిష్ ఛాంపియన్‌షిప్ గెల్చుకున్న తర్వాత రోన్ డెన్నిస్ 1998లో ఫోన్ చేశాడు. డెన్నిస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, మెక్ లారెన్ డ్రైవర్ అభివృద్ధి కార్యక్రమం కోసం ఒప్పందంపై సంతకం చేశాడు. భవిష్యత్ ఎఫ్‌వన్ స్థానానికి ప్రత్నామ్నాయం కూడా ప్రస్తావించాడు. ఇటువంటి కాంట్రాక్టు సాధించిన అతి పిన్నవయస్కుడిగా హామిల్టన్ రికార్డుకెక్కాడు.

పాయింటే తేడా...

ఫార్ములా వన్ గ్రాండ్ ఫ్రిక్స్‌లో 2007లో హామిల్టన్ రేస్ ట్రాక్ ఎక్కాడు. తొలిసారే ఒక్క పాయింట్ తేడాతో రన్నరప్ సాధించాడు. ఆ ఒక్క పాయింటే తేడా మిగతాదంతా ప్రత్యర్థుల్ని, రేసింగ్ ప్రపంచాన్ని ఉద్విగ్నానికి గురిచేసింది. సాంకేతికత విషయంలో, స్ట్రాటెజీ విషయంలో, ముఖ్యంగా కార్నర్ మెళకువల విషయంలో హామిల్టన్‌కు తిరుగు లేదని తేలిపోయింది. అతడి స్పీడ్‌ను ఆపడం కష్టమని తెలిసిపోయింది. అదే ఏడాది తొలి విజయాన్ని కెనడా గ్రాండ్ ప్రిక్స్‌లో సాధించి రికార్డుల్లో రాయించుకున్నాడు. పరిచయ సీజన్‌లోనే నాలుగు విజయాలు అందుకున్నాడు. 2008, 2014, 2015లో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ సాధించాడు. 'యంగెస్ట్ ట్రిపుల్ వరల్డ్ డ్రైవర్ రికార్డును లెవీస్ హామిల్టన్ 30 ఏళ్ల 292 రోజుల వయసులో 2015లో సాధించి ప్రపంచంలోని రెండో డ్రైవర్‌గా సత్తా చాటాడు. 2016లో 380 పాయింట్లతో ఫార్ములా వన్ రేస్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇటీవలే కెనడా గ్రాండ్ ప్రిక్స్‌లో సిక్సర్ సాధించి మరోసారి తనకు ఎదురులేదని నిరూపించాడు. అతడి ప్రతిభ, పాపులారిటీల వల్ల మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మైనపు ప్రతిమ గౌరవం కూడా దక్కింది. కెరీర్‌లో ఓ సీజన్‌లో జాతి వివక్షకు కూడా గురైన హామిల్టన్‌కు బాసటా 'రేస్ అగ్నెస్ట్ రేసిజమ్' పోటీలు పెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ అవసరం లేకుండానే అతనో సూపర్‌స్టార్‌గా మారి వివక్షల్ని జయించేశాడు. లెవీస్‌కు వింటేజీ కార్లు అంటే ప్రాణం. తనకు ఆల్ టైమ్ ఫేవరెట్ అయిన 1962నాటి ఏసీ కోబ్రా కారు కొనుక్కున్నాడు. మైకేల్ షూమేకర్‌లా తాను కూడా స్విట్జర్‌ల్యాండ్‌లో స్థిరపడాలని అనుకుంటున్నాడు.

- ఈశ్వర్ నెట్టెం

వినూత్నం................3
యూరోలో 'నాగా'రుచులు
స్టార్........4
రెబెల్ యాక్టర్
నవ్వుల్ పువ్వుల్......... 5
వింత లోకం............... 10
కుక్కలకు మ్యాన్షన్లు!
స్ఫూర్తి...............11
విభిన్న ప్రతిభా చిత్రం
కవిత్వమ్...............14
నాన్న.. చెమట చుక్క దేహం
తెలుసా 15
రుతుపవనాల గురుతులు

ఇండెక్స్

గాన గంధర్వుడు

అట్టమీది కథ...6

ఇదేం వినోదం ప్రత్యేకం

కథ 16
గోవిందా... గోవింద!!
ప్రత్యేకం...........19
అరుదైన స్నేహం...
కొత్త పుస్తకాలు..............20
ఒక ఉద్యమకారుని జీవితానుభవాలు
రుచి.............21
బాదం గాజర్ బర్ఫీ
బాల నేస్తాలు.............22
పేపర్ ప్లేట్ పీత
పద వికాసం.......24

ప్రియమైన మీకు

4జూన్ 2017 నాటి స్నేహ ఆదివారం అనుబంధంలో 'ప్రియమైన నీకు' కవర్ పేజీ కథనం చాలా బాగుంది. ఉత్తరాలు రాయడం ద్వారా వ్యక్తిత్వం పెంపొందించుకోవచ్చు. ఉత్తరం విలువ గురించి ఈ వ్యాసంలో చక్కగా తెలియజేశారు. ఇలాంటి చక్కని అంశాలు ప్రచురిస్తున్న మీకు నా అభినందనలు.

-ఎల్. ప్రఫుల్లచంద్ర, ధర్మవరం

గుర్తు చేసింది

'ప్రియమైన నీకు' అట్టమీది కథ ముప్ఫై సంవత్సరాలు వెనక్కి తీసుకు వెళ్ళింది. ఉత్తరాల్లో చోటుచేసుకొన్న ఆత్మీయానురాగాలు అనుబంధాల గురించి లోతుగా చర్చించింది. అలాగే వచ్చిన ఉత్తరాలన్నీ ఒక ఊసకు గుచ్చటాన్ని గుర్తుచేసింది. పాత ఉత్తరాల్ని మళ్ళీ మళ్ళీ చదువుకొనే అవకాశం ఈ ఉత్తరాల గుది కల్పించేది. కంప్యూటరు యుగంలో ఉత్తరం దాదాపు కనుమరుగైంది. ఉత్తరాల వల్ల చక్కని దస్తూరి ఏర్పడుతుంది. ఇప్పటి పిల్లలకు తల్లిదండ్రులు ఉత్తరాలు రాసే అలవాటు నేర్పించాలి. కనీసం పత్రికలకైనా విజ్ఞాన సంబంధమైన ఉత్తరాలు రాయిస్తే భావ



వ్యక్తీకరణ అభివృద్ధి చెందుతుంది. పాత జ్ఞాపకాలను కలకాలం పదిలపరిచే ఉత్తరాల సంస్కృతికి మళ్ళీ స్వాగతం పలకాలి. బాటసారి చిత్ర విశేషాలు బాగున్నాయి. ఈ చిత్రంలోని పాటలు ఇప్పటికీ జనాదరణ పొందుతూనే ఉన్నాయి. ఈ చిత్రంలో నాయకుడు చనిపో తాడు. ఆ పాత్ర చేయడానికి ముందుకు వచ్చిన ఏఎన్ఆర్ సాహసం ప్రశంసనీయం. ఆర్థికంగా మాత్రం విజయం సాధించటం గొప్ప విషయమే.

-మంకు శ్రీను, కొప్పర్రు

కవితలు బాగున్నాయి

స్నేహ సంచికలో ప్రచురించిన కవితలు బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వించాయి. 'ఎవరెస్ట్ ఎక్కాలంటే..' వ్యాసంలో ఎవరెస్ట్ ఎక్కడానికి ఏం కావాలో, ఏం ఉండాలో చక్కగా వివరించారు. 'పుస్తకాల పల్లె'లో అది మహారాష్ట్ర రాష్ట్రంలోని బిలార్ గ్రామంలో ఉన్నట్టు చదివాం. గ్రామాల్లో కూడా సాహిత్యం పట్ల మక్కువ పెరగడం మంచి పరిణామం.

-మధు చైతన్య, విశాఖపట్నం

పాతరోజులు గుర్తుకొచ్చాయి

కవర్‌స్టోరీ 'ప్రియమైన నీకు' చాలా బావుంది. ఆ రోజులు మళ్ళీ రావాలని పిలుపు ఇచ్చారు. ఉత్తరం అవసరం ఉందని చెప్పారు. పోస్టుమెన్ విలువ తెలిపారు. ఉత్తరం రాసే విధానాలు ఎలా ఉండేవో తెలిపారు. ఈ వారం అట్టమీది కథ ద్వారా ఉత్తరం యొక్క విలువని తెలుసుకోగలిగాం. ఆపాత చిత్రం 'బాటసారి', 'లేత గులాబీ నీళ్ళు', 'పచ్చని పటాలు', 'కలివికోడి' చాలా బాగున్నాయి. చక్కని సమాచారాన్ని అందిస్తున్న స్నేహకు ధన్యవాదాలు.

కె.వి.యన్ సీతారామాంజనేయులు, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

బెల్జియంలోని గెన్క్‌లో అది ఎండాకాలం. ఆ రోజు ఎండ కూడా ఎక్కువగానే వుంది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మండుటెండలో ఆహారం కొనుక్కునేందుకు అక్కడికి వచ్చిన కొందరు యువకులు రెస్టారెంట్లు, కేఫ్‌లు మూసివుండేసరికి తిరుగుముఖం పట్టారు. ఇంతలో ఎక్కడినుండో ఘాటైన ఘుమఘుమలు వెదజల్లుతుండడంతో ఒక్క నిమిషం అక్కడే ఆగిపోయారు. ఈ ఘుమఘుమలు ఎక్కడి నుంచో కాదు లూలు కిచెన్ నుండి వెలువడుతున్నాయి. బెల్జియం వాసులకి సాంప్రదాయ 'నాగా' వంటకాలని రుచి చూపించిన తొలి ఫుడ్ ట్రక్ మహిళ లులు 'ట్రైబల్ కిచెన్' గురించి మీరూ తెలుసుకోండి.

యూరోలో 'నాగా' రుచులు

ఈశాన్య నాగాల్యాండ్‌లోని కొండప్రాంతం కాబుయ్. అక్కడే 'నాగా' తెగకి చెందిన నివాసాలున్నాయి. లులు ఆ తెగకి చెందిన అమ్మాయే. పుట్టి పెరిగింది మాత్రం ఇంఫాల్‌లో.... తన కుటుంబంలో ఆరో సంతానం లులు. ఉమ్మడి కుటుంబంలో పెరిగిన తనకి బాల్యం తాలూకు జ్ఞాపకాలు ఎక్కువగా వంటింటితోనే ముడిపడి వుంటాయి. ఎందుకంటే వంటపనిలో వాళ్ళ అమ్మకి లులునే ఎక్కువగా సాయపడేదట. అలా అమ్మ నుంచి రుచికరంగా వండేయడం నేర్చుకుంది. చదువు ఆటపాటల్లోనే కాదు వండటంలో కూడా లులు మంచి మార్కులే కొట్టేసేదట. అమ్మచేతి వంటకాలని ఇష్ట పడనివారెవరు? నిజానికి ఇంటి నుండి దూరంగా వుండే వారికి ఆ లోటు స్పష్టంగా తెలుస్తుంది. యూనివర్సిటీ విద్య కోసం ఢిల్లీ వచ్చిన లులుకి ఇంటి భోజనం లోటు మరింతగా తెలిసొచ్చింది. చదువు పూర్తిచేసుకున్నాక ఉద్యోగప్రయత్నాలు మానుకుంది. మరుగున పడుతున్న నాగా సాంప్రదాయ వంటకాలని నేర్చుకోవడం మొదలు పెట్టింది. ఐదేళ్ళ క్రితం గోవాలో తనకి పరిచయమైన బాబ్‌ని వివాహం చేసుకుంది లులు. క్యాటరింగ్ వృత్తిలో ఆరితేరిన బాబ్‌తో కలిసి నెదర్లాండ్స్‌లోని లింబర్గ్‌లో ఒక ట్రక్‌లో ట్రైబల్ కిచెన్‌ని ప్రారంభించింది. బెల్జియంలో నిర్వహించే వివిధ మ్యూజిక్ ఫెస్టివల్స్‌కి క్యాటరింగ్ చేసే అవకాశం లభించడంతో ట్రక్‌లో ఆహాపదార్థాలని అక్కడికి తీసుకెళ్ళేవారు. తన ట్రక్‌లోనే నాగాల్యాండ్ సాంప్రదాయ వంటకాలని రుచికరంగా వండి అక్కడి వారికి అందించేది లులు. నెదర్లాండ్స్ వాసులూ వివిధ సందర్భాల్లో ఈ వంటకాలని రుచిచూసేవారు. అయితే వాళ్ళు ఎక్కువగా ఇష్టపడేది మెక్సికన్, టర్కిష్ రుచులని. కాస్త ఘాటైనా నాగాల్యాండ్ రుచులని అక్కడివారు ఎలా ఆదరిస్తారనే అనుమానం వీళ్ళకి లేకపోలేదు. అందుకే కారం, మసాల పాళ్ళు కాస్త తగ్గించి అక్కడి వారి రుచికి తగ్గట్టుగా ఈ వంటకాలని తయారుచేసేవారు. ప్రతి వంటకానికి సంబంధించి వాటి మూలాలు, అందులో ఉపయోగించే పదార్థాలపై బాబ్ ఇచ్చే వివరణ నెదర్లాండ్స్ వాసులని ఆకట్టుకుంది. రోడ్డు కూడళ్ళలో ఎంతోమంది లులు తరహాలో ఇన్‌స్టెంట్ ఫుడ్ అమ్మేవారు వున్నా వీరికో ప్రత్యేకత వుంది. వీరు తయారుచేసే పదార్థాలన్నీ అందరిలా ముందుగా వండి

తీసుకొచ్చేవికాదు. ఆర్డర్‌నిబట్టీ అప్పటికప్పుడే వాటిని వండి అందించేవారు లులు. ప్రత్యేకించి నాగాల్యాండ్‌కి చెందిన సుగంధద్రవ్యాలని చేర్చి తయారుచేసే వివిధ పదార్థాల ఫ్లేవర్‌లకి అక్కడి వారు ఫిదా అయ్యారు. లులు ట్రైబల్ కిచెన్‌లో లభించేది పూర్తి శాకాహార వంటకాలే. చక్కని రుచి, ఆకర్షణీయమైన రంగులతోపాటు ఘుమఘుమ లాడే ఆ సువాసనలే ఎక్కువమందిని తమ ట్రక్ వద్దకు రప్పించాయంటారు బాబ్. పచ్చి బఠానీ, కూరగాయలు, నాగాల్యాండ్‌కి చెందిన సుగంధద్రవ్యాల మేళవింపుతో తయారుచేసే వెగ్గీ డిలైట్ నెదర్‌ల్యాండ్ వాసుల ఫేవరెట్ డిష్. పందికొవ్వుతో చేసే పచ్చళ్ళ, సాస్‌లాంటి వాటిని వారాంతాల్లో అందించేవారు లులు. నాగాల్యాండ్ వాసులు ఆవిరితో మాంసాన్ని ఉడికించి ప్రత్యేకంగా తయారుచేసే పచ్చళ్ళు, వంటకాలకి కొత్తపేర్లని జోడించేవారు లులు. కొద్దికాలంలోనే లులూ ట్రైబల్ కిచెన్ బెల్జియం, నెదర్లాండ్‌లో ఫేమస్ అయిపోయింది. ఈ తరహా వ్యాపారాలన్నీ అక్కడ వేసవిలోనే నిర్వహిస్తారు. చలికాలంలో వీధులపైకి వచ్చేవారు తక్కువే. ఆ సమయంలో బాబ్‌తో కలిసి నాగాల్యాండ్, మణిపూర్‌ని చుట్టొస్తారు. పనిలో కాస్త బ్రేక్‌తోపాటు లులు కిచెన్‌కి కావాల్సిన సాంప్రదాయ సుగంధద్రవ్యాలన్నిటినీ తీసుకెళ్లేందకు అది వారికి అనుకూలమైన సమయం కూడా. నెదర్లాండ్స్‌లో రెస్టారెంట్ మ్యానేజ్‌మెంట్‌లో డిప్లొమా కోర్స్ పూర్తిచేసిన తర్వాత స్థానిక ఫ్రెంచ్ రెస్టారెంట్‌లో పనిచేశారు లులు. లులూ ట్రైబల్ కిచెన్ బెల్జియంలో ఇప్పుడు చాలా పేరుగడించింది. నిజానికి ఈ విజయం అంత తేలికగా తనకి లభించలేదు. బెల్జియం చేరుకున్న కొత్తల్లో అక్కడి వాతావరణ పరిస్థితులు, భాషతోపాటు అక్కడి వారి పోటీని తట్టుకుని నిలబడడం లులుకి కష్టమయ్యింది. ఎన్నో అపజయాలు చవిచూడాల్సి వచ్చింది. అయితే బాబ్ సహకారంతో తక్కువ సమయంలో ఈ రంగంలో నిలదొక్కుగోలిగింది లులు. కేవలం రుచికరమైన వంటకాలని అందించడమేకాదు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో స్థానికులకి నాగాల్యాండ్ వంటకాల తయారీని నేర్పిస్తోంది. నాగాల్యాండ్ వంటకాలతో భారతదేశ రుచుల్ని ఇలా విదేశాల్లోనూ రెట్టింపు చేస్తోందీ జంట.

- శర్వాణీ

రెబెల్ యాక్టర్

బాలీవుడ్ అగ్రతారల బిడ్డలతో నా పోటీ కాదు.. నేను చేసే పాత్రలు స్టార్‌లు, వారి బిడ్డలు చేయలేరు.. వసూళ్లు సాధించిన సినిమాలు నాణ్యమైనవని నేననుకోను.. బాలీవుడ్ నన్ను గుర్తించాలని కోరుకోను... ఇంత బోల్డ్‌గా మాట్లాడేది మనోజ్ బాజ్‌పేయి. రెండు సార్లు ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు వచ్చినా, నాలుగు ఫిల్మ్‌ఫేర్‌లు దక్కినా, ఏసియా పసిఫిక్ విలక్షణ నటుడిగా గుర్తించినా... మనోజ్ వ్యక్తిత్వ సరళి మారలేదు, అతడెంచుకునే పాత్రల తీరూ మారలేదు. కెరీర్ వేగం ఎలా ఉన్నా అంత అంతరాయాన్ని అతడి విలక్షణ పాత్రలు మరచేలా చేస్తాయి. అది 'అలీగఢ్'లాంటి ప్రధాన పాత్ర సినిమాలవి అయినా లేదా 'సర్కార్3'లోని కీలక పాత్ర చిత్రాలవి అయినా. షార్ట్‌ఫిల్మ్స్‌తోను ఆలోచనలో పడేస్తున్న ఈ నటనా ధృవతార గురించి కొన్ని వివరాలు..

బీహార్‌లోని ఓ కుగ్రామం బేల్వాలో పుట్టి పెరిగాడు మనోజ్. అప్పటి దిగ్గజ నటుడు మనోజ్ కుమార్ మీద తల్లిదండ్రులు పేరు పెట్టారు. కుటుంబంలోను సినిమా ప్రభావం ఉండటంతో చిన్నతనం నుంచే నటన మీద ఆసక్తి కలిగింది.

◈17 ఏళ్ల కల్లా ఢిల్లీకి మకాం మార్చి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు దరఖాస్తు చేసుకుంటే మూడు సార్లు తిరస్కరించారు.

◈ఓ దశలో ఆత్మహత్యాయత్నం చేసుకోవాలని ప్రయత్నించాడు. ఇంతలో బార్రీ జాన్ వర్క్‌షాప్‌లో శిక్షణ తీసుకునేందుకు అవకాశం వచ్చింది. నటుడు రఘుబీర్ యాదవ్ సలహాతో అందులో చేరడమే కాదు అతడి నటన నచ్చి బార్రీ జాన్ తనకు అసిస్టెంట్‌గా పనిచేయాలని కోరాడు కూడా.

◈చివరకు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలోనే టీచర్‌గా చేసే అవకాశం కూడా వచ్చింది.

◈1994లో సినిమాలో తొలి అవకాశం 'ద్రోహ్‌కాల్'లో ఓ నిమిషం పాత్ర ద్వారా దక్కింది.

◈అదే ఏడాది శేఖర్ కపూర్ పూలన్ దేవి మీద తీసిన 'ది బాండిట్ క్వీన్'లో ఓ బందిపోటుగా నటించాడు.

◈'స్వాభిమాన్', 'ఇంతియాహ్' వంటి దూరదర్శన్ నాటికల్లో నటించాడు.

◈1998లో వచ్చిన రామ్ గోపాల్ వర్మ 'సత్య'తో బ్రేక్ వచ్చింది. ఆ చిత్రంలో నటనకు గాను జాతీయ అవార్డు కూడా దక్కింది.

◈శ్యామ్ బెనెగళ్ చిత్రం 'జుబేదా'లో ప్రధాన పాత్ర దక్కించుకున్నాడు. జోధ్‌పూర్ మహారాజు హన్వంత్ సింగ్ జీవితాన్ని ఆధారం చేసుకుని అల్లుకున్న కథ అదని అంటారు. ఇందులో రేఖ, కరిష్మా కపూర్ మనోజ్ సరసన నటించారు.

◈అక్కడి నుంచి వైవిధ్య పాత్రలను ఎంచుకుంటూ సీరియెస్ రోల్స్‌కు బ్రాండ్‌గా మారిపోయాడు.

◈2003లో వచ్చిన 'పింజార్' అలాంటిదే. దేశ విభజన కాలానికి చెందిన ఇతివృత్తంతో రాసిన పంజాబీ నవల ఆధారంగా తెరకెక్కిన చిత్రం. మరోసారి అతడి నటనకు అవార్డు వచ్చి గుర్తింపు తెచ్చుకున్నాడు కానీ ఆ తర్వాత చేసిన పాత్రలు కెరీర్‌కు ఏమాత్రం పనికిరాలేదు.

◈ఆ తర్వాత కాస్త విరామం తీసుకుని 'రాజ్‌నీతి' (2010)లో రాజకీయ నాయకుడిగా చేసిన పాత్రతో మళ్లీ చర్చల్లోని వ్యక్తయ్యాడు.

◈2012లో 'చక్రవ్యూహ్'లో నక్సలైట్ పాత్ర, 'గ్యాంగ్స్ ఆఫ్ వస్సీపూర్'లో సర్దార్ ఖాన్ పాత్ర, 2013లో 'స్పెషల్ 26'తో సీబీఐ ఆఫీసర్ పాత్రలతో అస్సలు సంబంధం లేని నటనను ప్రదర్శించాడు.

◈దేశంలో వివాదాస్పదం అయిన ప్రొఫెసర్ రామ్‌చంద్ర సిరాస్ జీవితంపై ప్రఖ్యాత దర్శకుడు హన్సల్ మెహతా తీసిన 'అలీగఢ్'లో ప్రధాన పాత్రలో మనోజ్ నటనకు అంతర్జాతీయ చిత్ర విమర్శకులు కూడా ఆశ్చర్యపోయారు. విమర్శకుల నటుడనే పేరు గడించాడు.

◈మనోజ్ బాజ్‌పేయి చిన్న చెల్లెలు పూనమ్ దూబే బాలీవుడ్‌లోనే ఫ్యాషన్ డిజైనర్‌గా రాణిస్తోంది.

◈దక్షిణాదిన 'ప్రేమకథ', 'హ్యాపీ', 'వేదం', 'పులి' వంటి తెలుగు చిత్రాల్లో నటించి ఇక్కడి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాడు.

◈మనోజ్ మెథడ్ యాక్టర్. తనలానే విలక్షణ పాత్రలతో, నటనా శైలితో ప్రత్యేకత చాటుకుంటోన్న నవాజుద్దీన్ సిద్ధిఖీ లాంటి వారికి రోల్ మోడల్.

◈'అక్స్' చిత్రంలోని మనోజ్ నటనాశైలిని 'కిక్'లో అనుకరించానని నవాజ్ చెప్పాడు.

◈బెంగాలీ విప్లవ యోధుడు సూర్యసేన్ పాత్రలో 'చిట్టగాంగ్' చిత్రం చేసిన మనోజ్ ఎటువంటి పారితోషికం తీసుకోలేదు.

◈'కృతి', 'ఔచ్'లాంటి ప్రయోగాత్మక షార్ట్‌ఫిల్మ్స్‌లోను నటించాడు.

◈ప్రస్తుతం 'లవ్ సోనియా', 'అయ్యారీ', 'ఇన్ ది షాడో అండ్ మిస్సింగ్' చిత్రాలు చేస్తున్నాడు. చిత్రసీమలో రెబెల్‌గా ముద్ర వేయించుకున్న మనోజ్ అది తన డీఎన్‌ఏలోనే ఉందేమో అని నవ్వేశాడు.

◈ప్రతి ఏటా తన గ్రామానికి వెళ్లి అభివృద్ధి పనుల్లో పాలుపంచుకుంటాడు. ★



నవ్వుల్ - పువ్వుల్

పూల గాయం

అప్పారావు : అదేంట్రా నిన్నే మీ అబ్బాయి తలకి దెబ్బతగిలింది, ఆపరేషన్ చేయించానన్నావ్ మరి తల మీద ఆ పూలేంటి?

సుబ్బారావ్ : వాడికి ఆపరేషన్ చేసిన డాక్టర్‌కి ఎంబ్రాయిడరీ వర్క్ తెలుసట.

టీచర్ : ఒరేయ్...ఈ గాడిదను ఎందుకురా క్లాసులోకి తీసుకొచ్చావ్?

చింటు : మొన్న మీరేగా సార్...పెద్ద పెద్ద గాడిదల్ని సైతం మనుషుల్ని చేశానన్నారు...!



లెక్క కుదిరింది

టీచర్: రవి నీ దగ్గర ఒక యాభై రూపాయలున్నాయనుకో....మీ డాడీ ఇంకో యాభై రూపాయలిచ్చారు... ఇప్పుడు మొత్తం నీ దగ్గర ఎంతుందో చెప్పు

రవి : యాభై రూపాయలు టీచర్..

టీచర్ : ఏరా నీకు లెక్కలు సరిగా రావా..

రవి : మీకే... మా డాడి అస్సలు డబ్బులివ్వడనే సంగతి తెలీదు.

ఆ ఒక్కటీ

తండ్రి : చంటి నీకు సోషల్‌లో ఎన్నిమార్కులొచ్చాయి?

చంటి : రాము కంటే ఒక్క మార్కు తక్కువ అంతే నాన్నా.....

తండ్రి : మరి రాముకు ఎన్ని మార్కులు వచ్చాయేంటి?

చంటి : ఒక్క మార్కు నాన్నా.....

తండ్రి : ఆ.....

అతి తెలివి

టీచర్ : రాము నిన్న కంద పద్యం చెప్పాను కదా....చదువుకొచ్చావా?

రాము : లేదు సార్ .....

టీచర్ : ఏ ఎందుకు?

రాము : దురద పెడుతుందేమో అని భయమేసింది.

నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్: ఆంథోని ఫ్రెడా

సేకర్త: పి.బాలు, మచిలీపట్నం

కిసుక్కు సిత్రం



ఎరక్కపోయి ఇరుక్కుపోయానే..!

గాన గంధర్వుడు



ఘంటసాల! అమరగాయకుడు అనే పదానికి అర్థం పరమార్థం గానగంధర్వుడు అనే బిరుదుకి నిలువెత్తు నిదర్శనం! వెరసి తెలుగు పాట మీద ఎప్పటికీ చెరిగిపోని తేనె సంతకం. రోజూ ఎక్కడో ఓ చోట ఆయన కంఠాన్ని ఇప్పటికీ వింటూనే ఉంటాం. అది ఎప్పటికీ నిలిచి ఉండిపోయే కంఠం... కానీ ఇప్పుడే ఆ గాన గంధర్వుడి గురించి అట్టమీది కథ ఎందుకంటే ఈ నెల 21 ప్రపంచ సంగీత దినోత్సవం జరుపుకుంటున్నారు. గాత్రంలోనే సంగీత ఝరి ప్రవహించే ఘంటసాలే కదా తెలుగు పాటకు గొంతుక. ఈ సందర్భంగా ఆ తెలుగు పాట శాల గురించి కొన్ని వివరాలు...

- ఇమంది రామారావు
9010133844

ఆంధ్రదేశంలో కృష్ణమ్మ ఒడిలో ఎదిగి ఒదిగి ఎందరో మహానుభావులు ఇటు రంగస్థలానికి అటు సినీ కళామతల్లికి తమ సేవల్ని అందించి శాశ్వత కీర్తి ప్రతిష్ఠలను సంపాదించారు. అందులో మన ఘంటసాల ఒకరు. రత్నమ్మ – సూర్యనారాయణ దంపతులకు 1922 డిసెంబరు 4న చౌటిపల్లి గ్రామంలో జన్మించాడు ఘంటసాల వెంకటేశ్వరరావు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనే నానుడికి ప్రత్యక్ష నిదర్శనం ఘంటసాల! సూర్యనారాయణగారు మృదంగ విద్వాంసులు. ఇంట్లో నిరంతరం సంగీత సాధన సాగుతుండేది. ఘంటసాల బాల్యంలోనే తండ్రితో గొంతు కలపడం. పాదం కలపడం.. పరవశించి ఆడటం నేర్చుకున్నాడు. ఘంటసాల బాల్యంలో చూడముచ్చటగా వుండేవాడు. ఇంతలేసి కళ్లు. తేనెలొలికే తీయని గొంతు......ఎంతటి క్లిష్టమైన విషయాన్నైనా ఇట్టే గ్రహించే గ్రాహకశక్తి, అణకువ, ఇవన్నీ దేవుడిచ్చిన వరాలు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టడం వలన చిన్నతనం నుంచీ మమతానురాగాలూ.... మానవ సంబంధాల్లోని మాధుర్యం విలువలు తెలుసుకుని నడుచుకునేవాడు.. గనుక అందరికీ తలలో నాలుకలా వుండేవాడు. తండ్రితో బాటు ఆడుతూ.. పాడుతూ... వుండే బాల ఘంటసాలకు పాటలే లోకంగా ఉండేవి.

తండ్రి వీలునామా సంగీతమే..

ఘంటసాలకు 11 యేళ్లుండగా తండ్రి సూర్యనాయరణ మరణించాడు. మరణించే ముందు సంగీతం దాని ప్రాశస్త్యం.. ఎంత కఠోరమైన సాధన చేస్తే అంత ఫలితముంటుంది.. అని తెలియజెప్పి కన్నుమూశాడు. జీవితమంటే శూన్యంలా కనిపించిన ఘంటసాలనీ.. తల్లినీ.. సూర్యనారాయణ బావమరిది పిచ్చయ్యగారే వున్నంతలో చూసుకునేవారు. ఘంటసాలకి తండ్రి భౌతికంగా లేకపోయినా తండ్రి మాటలే వినిపించేవి. తండ్రి పాటలే తలపుకి వచ్చి ఏదో ప్రబోధిస్తున్నవని అనిపించేది. ఘంటసాల కనుమూసినా తెరచినా సంగీతం సంగీతం....

కఠోర సాధనే సాంత్వన

తండ్రి ప్రభావం ఎక్కువ ఉండే వయస్సే కాక తండ్రి రాణించిన రంగాన్నే ఎంచుకోవడంతో ఆయనే రోల్ మోడల్ అయ్యాడు. ఆయన మరణాన్ని తట్టుకోవడం ఘంటసాలకు అసాధ్యంగానే అనిపించేది కానీ తండ్రి చివరిగా చెప్పిన సంగీతమే సాంత్వన అయ్యింది. కఠినమైన సంగీతసాధనతో మానసికంగా తండ్రికి చేరువయ్యేవాడు. తండ్రి ఆప్యాయతను ఆస్వాదిస్తున్న భావనకు లోనయ్యేవాడు. తండ్రి ఆశయం నెరవేర్చడానికి సంగీతానికి సంబంధించిన గురుకులాల్లో చేరినా అక్కడ కట్టుబాట్లు,

జైలు జీవితం.. సినిమా అవకాశం

విద్య పూర్తయిన తర్వాత కొంతకాలం గాంధీజీ పిలుపు విని... దేశ స్వాతంత్ర్య పోరాటంలో!.. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆలీపూర్ జైలులో రెండు సంవత్సరాలు నిర్బంధంలో వుండి వచ్చాడు. మేనమామ 'వీణ్ణిలా వదిలేస్తే దారి తప్పి రాజకీయాలకు ప్రభావితుడవుతాడ'ని ఆలోచించి...తన కూతురు సావిత్రితో 1944 మార్చి నాల్గవ తారీఖున పెళ్లి జరిపించాడు. విశేషమేమిటంటే! తన పెళ్లికి తనే కచేరీ నిర్వహించాడు. అంతటి పాటల పిచ్చి.. ఈ సందర్భంగా సముద్రాల వారు ఘంటసాలని చూసి 'ఒకసారి చెన్నపట్నం వచ్చి కలువే!' అని ఓ మాట అన్నారు. అదో గొప్ప అవకాశంగా భావించిన ఘంటసాల చెన్నపట్నం పయనమయ్యి, సముద్రాల వారిని కలిశాడు. ఆయన రేణుకా ఫిలింస్‌కి తీసుకెళ్లి, నాగయ్య, బి.యన్‌రెడ్డిలకు ఘంటసాల గాత్ర సౌరభాన్ని వినిపించాడు. ఘంటసాల గాన మాధుర్యానికి పరవశించిన నాగయ్య.. బి.యన్‌రెడ్డి దర్శకత్వంలో నిర్మిస్తున్న 'స్వర్గసీమ' చిత్రంలో పాడే అవకాశం కల్పించారు. బాలాంత్రపు రజనీకాంతరావు సంగీతస్రష్ట. ఈ చిత్రానికి స్వర రచన చేశారు. ఆయన అప్పటికే ఆలిండియా రేడియోలో పనిచేయడం వలన నళినీకాంతరావు పేరుతో ఆ సినిమా వచ్చింది. ఆయన ముందు పాడటమంటే మాటలా? అందులోనూ గానసరస్వతి భానుమతి సరసన – భయపడుతూ పాడాడు. నాగయ్య ఘంటసాలకి ధైర్యం చెప్పి నెలకు నూట పదహార్లు జీతం కుదిర్చారు.

అవహేళనలను తట్టుకోలేక తిరిగి వచ్చేసేవాడు. సాటి కళాకారులు ఎవరైనా అపశ్రుతులు పాడితే సహించలేని గుణం చిన్నతనం నుంచీ వుంది. ఒక సారి అలాగే సాటి సంగీత కళాకారులతో తలపడి అభాసుపాలయ్యాడు. అప్పటికీ తెలిసీ, తెలియని వయసు ఆ అవమానమే తనలో ఆలోచనల్ని రెచ్చగొట్టింది. ఏ పనిలోనైనా పరిపూర్ణత్వం సాధించనిదే బయట ప్రదర్శించ కూడదు అని నిర్ణయించుకున్నాడు. అప్పట్నించి తనని అబ్బురపరిచే సంగీత కళాకారుల ఇంట వంట చేస్తూ వారి దగ్గర శిక్షణ తీసుకోవాలనుకు న్నాడు. కానీ ఫలితం శూన్యం. చాకిరీ చేయించు కోవడం తప్ప ఒక్కముక్క చెప్పిన పాపాన పోలేదు. అప్పట్లో ఆంధ్రదేశంలో వున్న ఒకేఒక్క సంగీత కళాశాల విజయనగరం మహారాజా వారి సంగీత కళాశాల. బస్సు కిరాయి కావాలి కదా ఆ కిరాయికి సరిపడా డబ్బులు వచ్చేలా తన దగ్గరున్న చిన్న బంగారు ఉంగరం అమ్మి విజయనగరం బయలుదేరాడు.

విజయమిచ్చిన నగరం

ఘంటసాల విజయనగరమే వెళ్లకపోయి వుంటే... తన జీవితం నిర్వీర్యంగా కాలగర్భంలో కలిసిపోయేదేమో..! అనే సందేహం కలుగుతుంది. ఎందుకంటే ప్రతిభను గుర్తించి బాహ్య ప్రపంచంలోకి తీసుకురావాలి కదా. అయితే విజయం వెంటనే రాలేదు. కష్టాలతోనే సంగీత ప్రయాణం ప్రారంభమైంది. తీరా విజయనగరం వెళ్లేసరికి వేసవి సెలవుల కారణంగా సంగీత కళాశాలని మూసేశారు. తలదాచుకోవడానికి చోటులేదు. కాలేజీ ప్రిన్సిపాల్ కాళ్లావేళ్లాపడి బతిమాలగా కాలేజీ ఆవరణలో బస చెయ్యడానికి అనుమతిచ్చారు. ఘంటసాల రోజుకో ఇంట్లో వుంటూ వారాలు చేసుకుంటూ బతికేవాడు. తోటి విద్యార్థులు అల్లరిచిల్లరగా వుంటూ తాముచేసిన దొంగతనాన్ని ఘంటసాల మీదకి తోసేశారు. దాంతో కాలేజీలోకి అనుమతి లేకుండా పోయింది. ఈ విషయం వూళ్లోవాళ్లకి తెలిసి వూళ్లోవాళ్లు 'ముఖం చూపించొద్దు..' అంటూ కట్టడి చేశారు. తలదాచుకోవడానికి చోటులేక ఆ వూరి గ్రామదేవత గుళ్లో తలదాచుకునేవాడు. ఏదో పని మీద గుడికి వచ్చిన పట్రాయని సీతారామశాస్త్రిగారు జరిగిందంతా విని తనతో తన ఇంటికి తీసుకుపోయారు. తను ఉచితంగా సంగీత శిక్షణ అయితే ఇవ్వగలడు కానీ భోజనం పెట్టే సామర్థ్యం లేదు. ఆకలిదప్పికలతో తిరుగుతున్న ఘంటసాలకి ఎవరో ఒక గురువుగారు "అడగందే అమ్మయినా అన్నంపెట్టదు నాయనా.. ఇదిగో జోలె.. ఈ సువిశాల ప్రపంచంలో.. జీవరాశులన్నీ ఒకరి మీద మరొకరు ఆధారపడి బ్రతకవలసిందే.. తప్పులేదు" అని చెప్పారు. ఘంటసాల భుజానికి జోలెకట్టి....! మాతాకబళం తల్లీ! అంటూ ప్రాధేయపడుతూ అడిగేవాడు. క్షణాల్లో జోలె నిండిపోయేది.. బ్రతకడానికి తినాలిగాని, తినడానికి బ్రతక్కూడదు కదా. సంగీత సాధన చేస్తూ.. ఒక్కోసారి మధ్యాహ్నం తెచ్చుకున్న అన్నమే చీమలు పట్టినా ఈగలు ముసిరినా.. తినేసేవాడు. సంగీత కళాశాల తెరిచారు. కాలేజీలో జాయినయ్యాడు. శాస్త్రిగారి శిక్షణలో నాలుగు సంవత్సరాల్లో చదవాల్సిన కోర్సు.. రెండేళ్లల్లో పూర్తి చేసి ప్రశంసలు పొందాడు. ద్వారం వెంకటస్వామి నాయుడు గారు కూడా ఘంటసాల మాస్టారి ప్రతిభా పాటవాల్ని గుర్తించినట్లు ప్రశంసించినట్లు సమాచారం! సంగీతంలో ప్రజ్ఞాపాటవాలు సంపాదించిన ఘంటసాల పెళ్లిపందిళ్లలోనూ, ఉత్సవాల్లోనూ... పాటలు పాడుతూ విజయనగరానికి ముద్దుబిడ్డగా పేరుతెచ్చుకున్నాడు. "ఏ తల్లి నా జోలెలో మొదటి కబళం వేసిందో... ఆ తల్లికి నేను జీవితాంతం రుణపడి ఉంటాను" అలాగే నర్తకి అయిన కళావర్‌రింగ్ అనే ఒక వేశ్య మాత కూడా తననెంతో ప్రోత్సహించిందని చెప్పుకుంటారు.

గాన పరవశంలో చిత్రసీమ

భానుమతి ఘంటసాల ప్రతిభని గుర్తించి తన స్వీయనిర్మాణం 'రత్నమాల' చిత్రానికి సహాయ సంగీత దర్శకుడిగా పనిచేసే అవకాశం కల్పించారు. అదే స్వరరచనకి పునాది. ఆ తర్వాత 'మనదేశం' (కృష్ణవేణి సినిమా యన్.టి.ఆర్ మొదటి సినిమా) బాలరాజు సినిమాలకు స్వరరచన చేసే అవకాశం లభించింది. 'బాలరాజు' చిత్రం సంచలన విజయం సాధించింది. తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్ట మొదటి రజతోత్సవ చిత్రం బాలరాజు! ఆ సినిమా విడుదలై అక్కినేనికీ యస్.వరలక్ష్మికి ఎంత మంచి పేరు వచ్చిందో ఘంటసాల వారికీ అంతే పేరొచ్చింది.విజయావారి 'పాతాళభైరవి'ని సినిమా ఘంటసాల పేరుని దశదిశలా వ్యాపించేలా చేసింది. ఇందుకు ప్రధానమైన కారణం ఘంటసాల స్వరరచనలోని వైవిధ్యం! విలక్షణత! ఒక విధంగా తెలుగు సినీసంగీత ప్రపంచాన్ని రెండు విధాలుగా చెప్పుకోవచ్చు. మొదటిది ఘంటసాలకు ముందు.. రెండు ఘంటసాల తర్వాత. అంతవరకూ శాస్త్రీయ సంగీతం ప్రధానంగా రాగభరితంగా వచ్చిన పాటలు.. ఘంటసాల సంగీతంలో ప్రత్యేకత



ఎన్టీఆర్, ఎన్నార్‌లతో ఘంటసాల

మాధుర్యం.. రాగంతోబాటు భావప్రకటన, స్వచ్ఛత, సంపూర్ణత్వం.. ఒక్కసారి విన్న పాటను మరిచిపోలేరు. అంతగొప్ప గానమాధుర్యం భావప్రకటనను బాలరాజు సినిమాలో పాడినప్పుడు చెరుకుదనం ఇప్పుడు... సుస్వర మాధురీ రసధార....పాతాళగంగలా తన్నుకొచ్చేది. విజయా వారి మరోచిత్రం 'మల్లీశ్వరి' బంగారానికి తావి అద్దినట్లు.. దేవులపల్లి వారి సాహిత్యానికి భానుమతి-రామారావుల నటనకి ఘంటసాల-భానుమతిల గానమాధుర్యం.......ఆ మాధుర్యంలోని 'విలక్షణత' ఆ పాటలకు పూర్ణాయుష్షుని ప్రసాదించాయి. సినిమాకి నేపథ్యగానం.. వాద్యకారులు వాద్య సహకారమందిస్తుండగా.. నటీనటులు ఎవరి పాట వారు పాడుకునే రోజులు పోయాయి. ఘంటసాల పాటల్లోని మాధురీ పరిమళాలు బాగా నచ్చాయి. ఎక్కడజూసిన ఘంటసాల గురించి చర్చే! అంతకుముందు ఎంతమంది నేపథ్యగాయకులున్నా... అగ్రతాంబూలం ఘంటసాల వారికే దక్కుతుందని నాగయ్యగారు పలుమార్లు ప్రశంసించారు.

'దేవదాసు'తో మత్తు జల్లి...

డిఎల్ నారాయణ ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించిన చిత్రం 'దేవదాసు'. ఆ చిత్రానికి సంగీతకళానిధి సి.ఆర్.సుబ్బురామన్, సహాయకులు ఎంఎస్ విశ్వనాథన్.. రచన సముద్రాల వారు.. పాటలు భేషుగ్గా వచ్చాయి. స్వరాలు అంతకంటే భేషుగ్గా ఉన్నాయి. మరి గానం? ఈ ప్రశ్నకి సమాధానంగా నిలబడ్డాడు ఘంటసాల! గతంలో సైగల్ పాడిన పాటల కంటే అద్భుతంగా పాడాడు ఘంటసాల!

ఆ పాటలు ఎప్పుడు విన్నా జవసత్వాలతో వుంటాయి. నిత్యనూతనాదిగా భాసిల్లుతాయి. ఆ పాటలు అజరామరం! ఆ పాటల్లోని బింకం.. పొంకం ఈనాటికీ తగ్గలేదు. అంతకుమించిన పాటలు రాలేదు అంటే అతిశయోక్తి కాదేమో!

ఎస్పీ బాలు, పి.బి శ్రీనివాస్‌తో ఘంటసాల

అప్పుడే నిర్ణయించుకున్నాడు అక్కినేని. బ్రతికినంతకాలం తనకు ఘంటసాలే పాడాలని ఏవో ఒకటి రెండు పాటలు తప్ప, బ్రతికినంతకాలం ఆ మాట నిలబెట్టుకున్నాడు.

సాలూరివారు, ఆదినారాయణరావు సమకాలీనులు. వీరి సంగీతం మీద ఆకుల నరసింహారావు గారి ప్రభావం వుంది. ఆకుల నటుడు, గాయకుడు, సంగీత దర్శకుడు. ఎన్ని పాటలు చేసినా మాధుర్యాన్ని విడిచిపెట్టేవాడు కాదు. అదే సాలూరి. ఆదినారాయణరావుల్లో కనిపిస్తుంది. 'అనార్కలి' చిత్రంలో ఘంటసాల పాడిన......'తాన్‌సేన్' పాత్ర ద్వారా పాడించిన 'మదన మనోహర మంజులనారీ' పాట మరచిపోగలమా? సినీ సంగీత ప్రపంచాన్ని ఓ మలుపుతిప్పిన స్వరసార్వభౌముడు ఘంటసాల! కె.వి.రెడ్డిగారి 'మాయబజార్' చిత్రం మాత్రం ఎంతగొప్ప స్వరసారథ్యాన్ని వహించిందని! ఘంటసాల మాస్టారుని చూడాలని ప్రేక్షకులు తహతహలాడుతుండేవారు అది కుదిరే పనేనా? పి.పుల్లయ్య స్వీయనిర్మాణం, దర్శకత్వం వహించిన 'వెంకటేశ్వర మహత్యం' చిత్రంలో స్వామివారి గర్భగుడి ముందు ఘంటసాల పట్టువస్త్రాలతో కూర్చుని తన అనుయాయులను తన వెంటబెట్టుకొని 'శేషశైలవాసా శ్రీ వెంకటేశా' పాడటం జరిగింది. అలా ఇద్దరి కోరికా నెరవేరింది.

మరపురాని ఘట్టాలు

కులదైవం' చిత్రంలోని పయనించే ఓ చిలుకా' పాట విని.. మహమ్మద్ రఫీ పరవశించి పోయారు. ఆయన చెన్నపట్నం వెళ్లేటప్పుడు మాస్టారు రికార్డింగ్‌లో వుంటుండగా కలిసి ఎంతో అభినందిస్తూ అమూల్యమైన గిఫ్టు ఇచ్చారు. ఆ అమూల్యమైన గిఫ్టు అంబాసిడర్ కారు అని కొందరు.. బంగారు గొలుసు అని మరికొందరూ ఆయన ఆత్మీయులే చెబుతుంటారు. 'శివశంకరీ-శివానంద లహరి' పాట పాడుతుండగా రష్యా పర్యటనలో చాలా ఇబ్బంది పడ్డారట. అప్పటి నుంచి ఆ పాటని వేదిక మీద పాడకూడదని నిర్ణయించుకున్నారు. 'మురళీకృష్ణ'లో పాట ఆత్రేయ రాశారు. 'ఎక్కడ వున్నా ఏమైనా' మాస్టర్ వేణు స్వరపరిచారు. ఘంటసాల మాస్టారు పాడారు. ఆ పాట విన్న వేణు కన్నీరుమున్నీరుగా ఏడ్చారు. ఆత్రేయగారికీ అత్యంత ఇష్టమైన పాట ఇది. మనసు బాగా లేనప్పుడు మనసార పాడుకునే పాట ఇది. ఇకపోతే చాలా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ విరాళాలు సేకరించి.. దేశరక్షణకి విరాళాలు ఇవ్వడంతో బాటు ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఒకరికి సహాయం చేయడంలో వున్న తృప్తి అనంతం అంటారాయన.

ఇప్పట్లా రెమ్యూనరేషన్లు ఓవర్‌నైట్

పాటల పాలవెల్లి

ఘంటసాల పాటల్లోని ఆణిముత్యాలను ఏరడం సముద్రం దగ్గర నిల్చొని చెమ్చాలతో నీళ్ళు లెక్క పెట్టినట్లు వుంటుంది. 'జగమే మాయ', 'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్' (దేవదాసు), 'గగనసీమలో వెలిగే ఓ మేఘమాలా' (మల్లీశ్వరి), 'మదన మనోహర మంజులనారీ' (అనార్కలి), 'నీవేనా నను పిలిచినదీ', 'సుందరి నీవంటి దివ్య స్వరూపంబు' (మాయబజార్), 'పయనించే ఓ చిలుకా' (కులదైవం), 'రసికరాజ తగువారము కామా' (జయభేరి), 'హే కృష్ణా ముకుందా మురారి!' (పాండురంగ మహత్యం), శివశంకరి (జగదేకవీరుని కథ), 'మోహనరాగమహా' (మహామంత్రి తిమ్మరుసు), 'మౌనముగా నీ మనసు పాడినా' (గుండమ్మ కథ), 'ఎక్కడ వున్నా ఏమైనా మనమెవరికి వారై వేరైనా నీ సుఖమేనే కోరుతున్నా' (మురళీకృష్ణ), 'ఎందుకో సిగ్గెందుకో' (ఆస్తిపరులు), 'జోరుగా..హుషారుగా షికారు పోదమా' (భార్యభర్తలు), 'ఒహో.. ఒహో నిన్నే కోరిక (ఇద్దరు మిత్రులు), 'చిగురాకులలో చిలకమ్మా' (దొంగరాముడు), 'ఒకటే హృదయం కోసము.. ఇరువురి పోటీ దోషము' (చదువుకున్న అమ్మాయిలు), 'కనులు కనులతో కలబడితే' (సుమంగళి), 'మాణిక్యవీణా' (మహాకవి కాళిదాసు), 'కనులు కనులతో కలబడితే ఆ తగవుకి ఘనమేది?' (కులగోత్రాలు), 'గాంధీ పుట్టినదేశమా ఇది!' (పవిత్రబంధం), 'పగడాల జాబిలి చూడు' (మూగనోము) 'ఈ జీవన తరంగాలలో' (జీవనతరంగాలు), 'నా హృదయంలో నిదురించే చెలి' (ఆరాధన), 'కల కానిది.. విలువైనదీ..' (వెలుగునీడలు), 'నేను పుట్టాను ఈ లోకం మెచ్చింది' 'ప్రేమనగర్' ఒకటా రెండా.. వందలూ... వేలు.... ఇవిగాక ప్రైవేటు రికార్డులు. కొన్ని... 'తల నిండా పూదండ.. గుత్తివంకాయ కూరోయ్ బావా.. నిను మరువలేనురా.' నండూరి వారి ఎంకి పాటలు.. పుష్పవిలాపం.. కుంతి విలాపం.. ఎన్నని రాయగలం. రాయాలంటే ఓ పుస్తకం వెయ్యిపేజీలు రాయొచ్చు. ఘంటసాల జీవితంలోని గానమాధుర్యం సర్వసమగ్రంగా పొందుపరచాలంటే మరిన్ని ముఖ్యమైన విషయాలు విస్తరించకూడదని ఇక్కడితో పాటల ప్రస్తావన ఆపుతున్నాం.

పెంచేవారు కాదు. ఘంటసాల మాస్టారు ప్రొడ్యూసర్లు ఎంతిస్తే అంత పుచ్చుకునేవారు. మారు మాట్లాడేవారు కాదు. ముందు తన దగ్గర వాద్య కళాకారులందరికీ డబ్బులు ఇచ్చిన తరువాత. మిగిలితే తీసుకునేవారు, తగిలితే వేసుకునేవారు. ఈ నేపథ్యంలో జరిగిన సంఘటన ఒకటి... ఒకరోజు తెల్లారుజామునే యన్.టి.ఆర్ ఇంటికి వచ్చారు. యన్.టి.ఆర్ త్రివిక్రమ్‌రావు ముఖ్యవిషయాలు మాట్లాడుకుంటున్నారు. త్రివిక్రమ్‌రావు సౌత్ ఇండియన్ ఫిలిం చాంబర్‌కి అధ్యక్షులు ఘంటసాల మాస్టారు వచ్చారని తెలిసి రమ్మని స్వాగతించారు. ఘంటసాల మొహమాటపడిపోతూ 'నా కుటుంబం పెరిగింది. ఖర్చులు పెరిగాయి. ఈ సమయంలో మిమ్మల్ని రెమ్యూనరేషను పెంచమని అడగడం భావ్యం కాదు. చిత్రనిర్మాణవ్యయం పెరిగింది. అందువలన తమరు అనుమతి ఇస్తే విజయనగరం వెళ్లిపోయి పదిమంది పిల్లలకు పాఠాలు చెప్పుకుంటాను' అన్నారు. ఇద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. అప్పటికి ఘంటసాల మాస్టారు తీసుకుంటున్న రెమ్యూనరేషన్ కేవలం అయిదువందల రూపాయలు. అంత మొహమాటస్తుడు.

సాటి గొంతుకులకు ప్రోత్సాహం

సంగీత ప్రపంచమంతటినీ తన స్వంత కుటుంబసభ్యుల్లా చూసుకునేవారు ఘంటసాల. ఎవరికే ఆపద వచ్చినా తనే ముందుడేవారు. చిత్రంలో ఆరు పాటలుంటే ఒకటో రెండో పాటలు తనుపాడి మిగతా పాటలు పిఠాపురం, మాధవపెద్ది.. కొందరు ఔత్సాహిక గాయనీగాయకులు పేర్లు చెప్పేవారు. అలాగే కోరస్ పాడేవాళ్లు ఆర్థికబాధలతో వుంటే మ్యూజిక్ డైరెక్టర్‌కి చెప్పి నాలుగయిదు సినిమాల్లో కోరస్ ఛాన్సులు ఇప్పించి ఆ నెల గడిచి గట్టెక్కలా చూసేవారు. ఆయనకో చిత్రమైన తీయని అలవాటుండేది.

ఆంధ్రరాష్ట్ర అవతరణలో..

పొట్టి శ్రీరాములు నిరాడంబరతకీ అకుంఠితమైన దేశభక్తికీ ఘంటసాల మాస్టారు చాలా ప్రభావితులయ్యారు. దీక్ష చేసినంత కాలం చేదోడువాదోడుగా వుంటూ దేశభక్తి గీతాలతో ఉత్తేజపరిచేవారు. శ్రీరాములవారు అసువులు బాసిన తర్వాత ఆ కార్యక్రమాన్ని మాస్టారే భుజాన వేసుకున్నారు. దేశభక్తి పాటలు భజనలతో సాగనంపారు. స్వతహాగా దేశభక్తి ఆయన రక్తంలో జీర్ణించుకుపోయింది. అందుకే దేశం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండేవారు.

ప్రముఖుల పలుకులు

"'పయనించే ఓ చిలుకా' పాటవిని పరవశించి పోయాను. ఘంటసాల అమరగాయకుడు.!" **- మహమ్మద్ రఫీ**

"ఘంటసాల గొంతులో దివ్యమైన ధ్వని వుంది. అది మరొకరికి లేదు. రాదు. ఘంటసాల చూసినప్పుడు అసూయ కలుగుతుంది." **- బాలమురళీకృష్ణ**

"ఆయన నా గుండె. ఆయన నా గొంతు. ఆయన నా సినిమా జీవితం. ఆయన మరణించారన్న వార్తను జీర్ణించుకోలేను. ఆయన భౌతిక కాయాన్ని చూస్తే నా గుండాగిపోతుందేమో! భయమేసి వెళ్లడం మానేశాను." **- అక్కినేని నాగేశ్వరరావు**

"శిష్యులు చాలామంది వుంటారు. ఘంటసాల లాంటి శిష్యులుండటం సుకృతం! కృతజ్ఞతకు మారుపేరు మా ఘంటసాల.. ఎప్పుడో..ఏదో చిన్న మాట సాయం చేస్తే నాకు.. నా కొడుకు సంగీతరావుకూ అన్నంపెట్టాడు." **- పట్రాయని సీతారామశాస్త్రి (ఘంటసాల గురువు)**

ఉదయం తొమ్మిది గంటలకు ముందే రావడం.. తనకిష్టమైన పెసరట్టు ఉప్మా తినడం.. పొంగలి పాలల్లో కలుపుకొని అందులో పంచదార వేసి తినేవారు. తనకు షుగర్ వ్యాధి వుందని తెలిసినా పక్కన పెట్టేసేవారు. తర్వాత ఆయన కోసం ప్రత్యేకించి కట్టించి తీసుకువచ్చిన తాంబూలం వేసుకునేవారు. పల్చటి జుబ్బా గ్లాస్గో లుంగీ పంచె, గోల్డ్ ఫ్రేము కళ్లద్దాలూ ధవళ వస్త్రాలూ, ఎర్రగా పండిన పెదవులు.. భలే చూడముచ్చటగా వుండేవారు. కళ్లద్దాలోంచి నవ్వుతున్న కళ్లతో చూస్తు పేరుపేరునా పలకరించేవారు. ఆ తర్వాత ఆర్కెస్ట్రాతో రిహార్సల్స్ చేసి.. రికార్డింగ్ థియేటర్లోకి వెళ్లి.. సహచర గాయనికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా పాటలో మెలకువలు నేర్పుతూ తన తృప్తి మేరకు పాడేవారు. కంపోజర్‌కు ఓకే అయినా తనకి తృప్తిగా అనిపించకపోతే మళ్లీ మళ్లీ పాడి.. ఫైనల్ అవుట్ పుట్‌ని సౌండ్ ఇంజనీరు పక్కన అందరితో కలిసి కూర్చొని విని పసిపిల్లాడిలా కేరింతలు కొట్టేవారు. ఆయన ఏ పాట పాడినా తాదాత్మ్యం చెందుతూ పాడేవాడు. మాస్టారికి మధుమేహం వ్యాధి వుంది. స్వతహాగా భోజనప్రియుడు. ఆహార నియంత్రణ చేయలేకపోయేవారు. ఎవరే మందు చెప్పినా వాడేసేవారు. ఇంకా చిన్నవయసు కదా సంతోషంగా తినండి... ఆనందంగా వుండండి అంటే పొంగిపొయ్యేవారు. నాటువైద్యం కూడా చేయించుకున్నారు. మందు వికటించి యాభై ఒక్క సంవత్సరానికే నూరేళ్లు నిండాయి.

కోటికి ఒక్కరు

ఘంటసాల మాస్టారి లాంటివారు నూటికో కోటికో ఒక్కరుంటారు. 'తానెంతో జగమంత' అనే మనస్తత్వం గల వ్యక్తి ఘంటసాల. అందుకే అందర్నీ తనతో సమానంగా చూసుకునేవారు. 'అల్లూరి సీతారామరాజు' చిత్రం సమయానికే పాడుతున్నప్పుడు ఆయాసం వచ్చేది. అలాగే పాడుతూ 'తెలుగువీర లేవరా' పాట పాడారు. ఆ పాటకి శ్రీశ్రీకి జాతీయ ఆవార్డు వచ్చింది. 1990 ఆయనకి పద్మశ్రీ అవార్డు వచ్చింది. 1917లో ఐరోపా, అమెరికాలో సంగీత కార్యక్రమాలు చేసి అక్కడి ప్రేక్షకులకు తెలుగుపాట రుచి చూపించారు. 1972లోనే ఒకసారి రవీంద్రభారతిలో కచేరీ చేస్తున్నప్పుడు గుండెనొప్పి వచ్చింది. హస్పిటల్‌లో చేరాడు. చికిత్స జరిగింది. ఆ సమయంలో గుర్తుండిపోయే కార్యక్రమం ఏదయినా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ సంకల్పం కలగ్గానే 'భగవద్గీత'కు స్వరరచన చేశారు. విజయాకృష్ణమూర్తి పక్కనే వున్నారు. సంగీత రావు కూడా తోడున్నాడు. రికార్డింగ్ జరక్కుండానే తనువు చాలిస్తానేమో భయపడ్డాడు కానీ, ఒక పక్క ట్రీట్‌మెంట్ తీసుకుంటూనే పరిసమాప్తి గావించాడు. ఈ రోజు భారతజాతికి ఘంటసాల మాస్టారు అందించిన గానామృతం తరగని సంపద! ఘంటసాల వారు జాతిసంపద!

అరుదైన గౌరవం

ఘంటసాల గౌరవార్థం తపాల బిళ్ల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘంటసాల విగ్రహం. హైదరాబాద్ రవీంద్రభారతి ఆవరణలో ఘంటసాల కళానిలయం, ఘంటసాల సంగీత కళాశాల (శరత్‌చంద్ర) ఘంటసాల పేరిట సంగీతోనృత్యోత్సవాలు.. ఆంధ్రదేశంలోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట ఘంటసాల మాస్టారి సంగీతోత్సవాలు కొనసాగుతూనే వుంటాయి. ఎవరన్నారు? ఘంటసాల వారికి యాభై ఒక్క సంవత్సరాలని. తెలుగు పాట బ్రతికున్నంత కాలం ఆయన బ్రతికుంటారు. ఆయన అమరగాయకుడు! భారతీయ సంగీత సామ్రాజ్యానికి చక్రవర్తి.

వింత లోకం

మరో ప్రాణమా!



బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల్ని కోలుకునేలా చేసేందుకు ఫిలడెల్ఫియాకు చెందిన 'బయోక్వార్క్' కంపెనీ ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించిన ప్రయోగాల్ని చేసేందుకు సిద్ధపడుతోంది. కొన్ని రకాల ఇంజెక్షన్లను ఇవ్వడం ద్వారా బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల్లో చలనం కలుగుతుందని చెబుతోంది. సాధారణంగా చాలా దేశాల్లో బ్రెయిన్ స్టెమ్ వ్యవస్థ పూర్తిగా పనిచేయడం ఆగిపోతే మరణించినట్లు పరిగణిస్తారు.



కానీ దాన్ని పనిచేయించగలిగితే వ్యక్తి తిరిగి జీవిస్తాడని ఆ సంస్థ అంటోంది. గతేడాది వీరి ప్రయోగాల్ని భారత్‌లోనే నిర్వహించేందుకు ప్రయత్నిస్తే కొన్ని సమస్యలు, సందేహాల వల్ల మెడికల్ కౌన్సిల్ అనుమతించలేదు. అందుకే వాళ్లు దక్షిణ అమెరికాలోని ఓ దేశంలో తమ ప్రయోగాలు నిర్వహిస్తామని ప్రకటించారు. మనదేశానికి చెందిన వైద్యులు హిమాంశు బన్సాల్, బయోక్వార్క్ సీఈవో ఇరా పాస్టర్ నేతృత్వంలో ఈ ప్రయోగం జరగనుంది. 12-65 ఏళ్ల మధ్యనున్న బ్రెయిన్ డెడ్ రోగుల్ని ఎమ్మారై ద్వారా పరీక్షిస్తారు. తర్వాత రోగి శరీరం నుంచి తీసుకున్న రక్తం నుంచి పిండ మూల కణాల్ని అభివృద్ధి చేసి వాటిని తిరిగి రోగి శరీరంలోకి చొప్పిస్తారు. వెన్నెముక ద్వారా పెప్టైడ్స్‌ను ఇంజెక్ట్ చేస్తారు. ఆ తర్వాత 15 రోజుల పాటు లేజర్లు ఇతర వైద్య ప్రక్రియల ద్వారా నెర్వ్ స్టిమ్యులేషన్ చేస్తారు. ఇలా చేయడం వల్ల బ్రెయిన్ డెడ్ వ్యక్తులు తిరిగి కోలుకోవచ్చని బయోక్వార్క్ బలంగా విశ్వసిస్తోంది. 'రీ-యానిమా' ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ ప్రయోగం జరుగుతోంది. ఇరా పాస్టర్ ఆ ప్రాజెక్ట్ సలహాదారు కూడా. కొందరు వైద్యులు దీనిపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రయోగం చేసి తీరుతామని పాస్టర్ అంటున్నారు. చూడాలి ఏమవుతుందో..? ఇలాంటి ప్రయోగాలతో త్వరలో ప్రాణం లేచెస్తోందంటే అర్థం మారిపోతుందేమో.

80 కేజీల ఇల్లు

జపాన్‌లో భూకంపాలు ఎక్కువని తెలుసు కదా. అందుకే అక్కడి ఇళ్లను భూప్రకంపనల్ని తట్టుకునే విధంగా కట్టుకుంటారు. కానీ భారీ స్థాయి భూకంపం వస్తే మాత్రం ఎలాంటి ఇళ్లైనా నేలకూలుతుంది. ఎక్కువ మరణాలు వీటిలో చిక్కుకునే సంభవిస్తుంటాయి. అందుకే జపాన్ డోమ్ హౌజ్ అనే కంపెనీ ఓ సరికొత్త ఐడియాతో ముందుకొచ్చింది. మనం సినిమాల్లో ఇళ్లు కూలిపోవడం, గోడలు విరిగి మనుషుల మీద పడటం వంటివి చూస్తుంటాం. అవి నిజం కట్టడాలు కాదు స్టైరోఫోమ్ అదే థర్మాకోల్ షీట్లతో సెట్ వేసినవేనని మాట్లాడుకుంటాం. సరిగ్గా అదే సెట్టింగ్‌ల్ని జపాన్ డోమ్‌లకు వాడుతున్నారు. స్థూపాకారంలో ఉండే ఈ ఇళ్లకు సాధారణ స్టైరోఫోమ్ కాకుండా మరింత పటిష్ఠంగా ఉండేదాన్ని వాడుతున్నారు. డోమ్ ఆకారం వల్ల అదనపు ధృఢత్వం వస్తుంది. బలంగా ఉండటమే కాదు చాలా తేలిగ్గా ఉంటుంది. ఒకవేళ భూకంపాలకు విరిగి పడినా పెద్ద ప్రమాదమేం ఉండదు.



సాధారణంగా వీరి మోడల్ ఇల్లు 3 మీటర్ల ఎత్తుతో, 387 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 80 కేజీల బరువుంటుంది. ముగ్గురు వ్యక్తులు దీన్ని వారంలో బిగించేస్తారు. ఈ డోమ్‌లకు గిరాకీ పెరుగుతోంది. పై అంతస్తు వేసుకోవచ్చా అని అడక్కండే.

కుక్కలకు మ్యాన్షన్లు!

పెంపుడు శునకాలు హాయిగా పడుకోడానికి దాదాపు కోటిన్నర రూపాయలు తగలేసి మినీ మ్యాన్షన్లు కడతారట..!!! యూకేకు చెందిన హెకేట్ వెరోనా అనే కంపెనీ ఆలోచన ఇది. ఆటోమేటిక్‌గా లైటింగ్, హీటింగ్, వెంటిలేషనే కాదు ఆహారాన్ని, నీటిని ఇచ్చేందుకు ఏర్పాట్లతో పాటు టీవీ, సౌండ్ సిస్టమ్ కూడా ఉంటాయట. ఇంటర్నెట్ అనుసంధానంతో మేనర్‌లో వెచ్చగా పడుకున్న కుక్కగారితో ఎప్పుడంటే అప్పుడు మాట్లాడేందుకు కెమెరాలు, స్క్రీన్లు అదనపు సౌకర్యం. ఓ పడక గదితో పాటు టీవీ చూసేందుకో రూమ్ చుట్టూ ఉన్న పరిసరాల్ని బాల్కనీల్లోంచి చూసేందుకు ప్రత్యేక పనోరమిక్ ఏర్పాట్లు (కుక్క ఎత్తుకు తగ్గట్టు) ఉంటాయి. వీటి కోసం పెద్ద ఆర్కిటెక్ట్‌లని, పశు వైద్యుల్ని కూడా సంప్రదించారు. ఒక్కోదాన్ని పూర్తి చేసేందుకు 2-4 నెలల కాలం పడుతుంది. అంతేలెండి... కుక్కలకు కుటుంబ సభ్యుల స్థాయినిచ్చి... కన్నవారిని ఇంట్లో నుంచి తరిమే సందర్భాలు చూస్తున్నాం. సాధారణంగా కుక్కల్ని కాపలాకు పెంచుకుంటారు. కానీ ఆ పనిని పకడ్బంధీగా చేసేందుకు మనుషులే ఉండగా డబ్బింటి శునకాలకు ఆ మాత్రం కష్టం ఎందుకు? వెచ్చగా జారిగిలా పడుకుని టీవీ చూస్తే సరిపోతుంది. అసలే జాతి కుక్కలు కదా..! పక్కనోడు ఈ పూట తిన్నాడో లేడోననే ఊసెందుకు ఉక్కిరిబిక్కిరి చేసే విలాసాలుండగా..!!



విభిన్న ప్రతిభా చిత్రం

విభిన్న ప్రతిభకు నిర్వచనంగా ధవళ్ ఖాత్రీని చెప్పుకోవచ్చు. రెండు చేతులు లేకపోయినా గొప్ప చిత్రకారుడిగా అబ్దుల్ కలాం చేతే మన్ననలు అందుకున్నాడు. గిటార్ వాద్యంతోను ముగ్ధుల్ని చేస్తాడు. రమణీయ ప్రకృతి దృశ్యాలు, గ్రామసీమలే కాదు, ఛాయాచిత్రాలకు నకళ్లుగా అనిపించే పోర్ట్రెయిట్‌లు వేయడంలో దిట్ట. ఇప్పటి వరకు 300కు పైగా పెయింటింగ్‌లు వేసిన ఖాత్రీది ఓ స్ఫూర్తి కథ.



గాలి పటాల పండుగంటే ఖాత్రీకి ఎక్కడలేని ఇష్టం. చదువుకునే రోజుల్లో ఉత్తరాయణం కోసం ఓ రకంగా ఏడాదంతా ఎదురు చూపులే. 2003లో అలాంటి ఉత్తరాయణం గాలి పటాలు ఎత్తున ఎగిరేందుకు వేగంగానే వచ్చేసింది. అంతే వేగంగా అది ఖాత్రీ జీవితాన్నీ మార్చేసింది. గాలి పటాలు ఎగరేసేటప్పుడు చూసుకోకుండా అతడి చేతులు విద్యుత్ తీగెల్ని తాకాయి. అంతే క్షణాల్లో అతడి చేతులు కాలిపోయాయి. పైనుంచి కిందకు పడి చలనం లేకుండా ఉన్నాడు. అందరూ ఖాత్రీ చనిపోయాడనే అనుకున్నారు కానీ ఎందుకైనా మంచిదని ఆస్పత్రికి వెంటనే తీసుకెళ్లారు. అప్పటికే గుండె చప్పుడు ఆగిపోయింది. కానీ వైద్యులే ఆశ్చర్యపోయేలా మళ్లీ ఊపిరి తీసుకున్నాడు. ఈ రెండో జీవితం అతడిని స్ఫూర్తివంతంగా బతికేలా తన వైకల్యంతో యుద్ధం చేయడానికి ప్రేరణనిచ్చింది. అహ్మదాబాద్ ఇసాన్‌పూర్‌కు చెందిన ధవళ్ ఖాత్రీకి ఈ ప్రమాదం 14 ఏళ్ల వయస్సులో జరిగింది. ఆస్పత్రిలో ఉండగానే పెన్సిల్‌ను పట్టుకునేలా తల్లి సాధన చేయించింది. ఆ తర్వాత అక్షరాలు రాయగలగడం వంటివి ఆరు నెలల పాటు నేర్చుకున్నాడు. కానీ రెండు చేతులూ కోల్పోవడంతో అప్పటి వరకు చదువుకున్న పాఠశాలలో కొనసాగేందుకు అడ్డంకులు పెట్టారు. కానీ స్క్రైబ్ లేకుండానే తన పరీక్షలు తానే రాసుకునేంత స్థాయికి దృఢ నిశ్చయుడయ్యాడు. దాన్ని చేసి చూపించాడు. తన మొండి చేతులతోనే గిటార్ వాయించడంలో శిక్షణ తీసుకున్నాడు. ఆ తర్వాత అతడి దృష్టి పెయింటింగ్‌పై పడింది. సన్నని గీతలు, స్ట్రోక్‌లతో చిత్రాలను తన చేతులు గీయగలవా అనే సందేహం మిగతా వారికి కలిగింది గానీ ధవళ్‌కు కాదు. చిత్రలేఖనంలో అద్భుతాలు చేయడం మొదలెట్టాడు. ఓ ప్రకృతి దృశ్యాన్ని చిత్రీకరించడానికి కేవలం 2–3 గంటలు సమయం తీసుకుంటాడంతే. తాను వేసిన చిత్రాలతో గుజరాత్, మహారాష్ట్రల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేసేవాడు. అలా చాలామందికి ప్రేరణయ్యాడు. 2012 కల్లా పెయింటింగ్ కెరీర్ అయిపోయింది. సల్మాన్ ఖాన్ పోర్ట్రెయిట్ వేసి 'ఎంటర్‌టైన్‌మెంట్ కే లియే కుచ్ కరేగా' షోలో బహుమతిగా ఇచ్చాడు. ఆ టీవీ కార్యక్రమం ద్వారా వార్తల్లో నిలిచాడు. మహేంద్ర సింగ్ ధోని, అమితాబ్ బచ్చన్ అంటే ఖాత్రీకి ఇష్టం. వారిలోని పోరాట పటిమ నచ్చుతుంది. ఖాత్రీకి క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ అన్నా ఇష్టమే. ఇప్పుడిప్పుడే టాట్టూలు వేయడంలోను పట్టు సాధిస్తున్నాడు. ఇది సునిశితమైన కళ కావడంతో అతడికి నచ్చింది. తాను ఎంచుకున్న రంగం వేరే అవకాశం లేక స్థిరపడింది కాదు. ఎన్ని

సవాళ్లున్నా ఇష్టపడింది కనుకే చిత్రలేఖన కళలో ప్రతిభ చాటుతున్నాడు. లైవ్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొంటూ సత్తా చూపుతున్నాడు. అలాగే ప్రేరణా ప్రసంగాల్నిస్తూ మరికొందరిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాడు. అతడికి బాగా నచ్చిన మాట 'ఏదీ అసాధ్యం కాదు'. తాను నిజం చేస్తున్న మాట 'చేతి రేఖల్లో ఏమీ లేదు.. చేతులే లేనివారు చేస్తున్న అద్భుతాల సంగతేంటి' అనేది. ధవళ్ ఖాత్రీ పేరు 'ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్', 'మిరేకిల్ వరల్డ్ రికార్డ్స్'లోను ఎక్కింది. 'మిస్టర్ యూనిక్ ఆర్టిస్ట్'గా బిరుదు దక్కింది. టీవీ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటూ ప్రదర్శనలు ఇస్తున్నాడు. తనలాగే విభిన్న ప్రతిభావంతురాలైన దీపా మాలిక్‌ను కలుసుకుని ఆమె నుంచి మరింత స్ఫూర్తి పొందాడు ధవళ్.





ఇదేం విన

వద్దంటున్నా చీర్‌గాళ్స్‌ను ఆటల్లో అలవాటు చేసేశారు. ఇంటిల్లిపాదీ టీవీలకు అతుక్కుపోయే లైవ్ టెలీకాస్ట్‌ల్లో ఈ ఎంటర్‌టైన్‌మెంట్ అవసరమా అని పెద్ద చర్చే జరిగింది. ఇప్పుడా చీర్‌గాళ్స్ తరహాకి అటూ ఇటూగా మన వీధి సంతలోకి, ఇంటి పబ్బంలోకి చీప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను దింపేస్తున్నారు. తెలీకుండానే మనమూ ప్రోత్సహించేస్తున్నాం.

ప్రత్యేకం

ఒకప్పుడు పెళ్లికి వెళితే సాదరంగా ఆహ్వానించే వాళ్లు పెళ్లి పెద్దలు. ఆ తర్వాత అత్తర్ జల్లి పూలు అందించే అమ్మాయిల్ని పెట్టేశారు. కుర్రాళ్ల వెకిలి చేష్టలు, పెద్దోళ్ల మకిలి నవ్వుల్ని పట్టించుకోకుండా వాళ్లు చిరునవ్వుతో నమస్కారం చేయాలి. ఇప్పుడు పుట్టిన రోజు ఫంక్షన్లను కూడా గ్రాండ్‌గా చేయడం మామూలైపోయింది. మిగతావారి కన్నా విభిన్నంగా ఉండాలనే ఉత్సాహంతో ఎటువంటి ఉద్యోగాల్ని ప్రోత్సహిస్తున్నారో చూసుకోవడం లేదు. ఫంక్షన్లనే కాదు వ్యాపార ప్రకటనలు, ప్రచార కార్యక్రమాల్లో కూడా సాటి మనిషి ఉనికి లేనట్టే ప్రవర్తిస్తున్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ పేరిట, క్రియేటివిటీ పేరిట తెలిసోతెలియకో కొందరి మనుసులకు వెలకట్టేస్తున్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేటూ ప్యూన్ ఉద్యోగానికి పరుగు తీస్తున్న ఈ ఆకలి రాజ్యంలో ఇష్టమున్నాలేకున్నా, బలవంతానో, చేసేది లేకో కొందరు కొన్ని ప్రాణం చచ్చిపోయే ఉద్యోగాల్ని ప్లాస్టిక్ నవ్వులతో ముగించేస్తున్నారు. అలాంటి కొన్ని ఉద్యోగాల వెర్రితలల గురించి..

బ్రాండ్ల టాట్టూలు

ప్రేయసి చిత్రాన్నో, మనసుకు నచ్చిన విషయాన్నో టాట్టూలుగా వేసుకోవడం పరిపాటి. ప్రపంచంలో తమదంటూ అని చెప్పుకునే చాన్స్ ఏదైనా మిగిలిందంటే అది దేహమే. దాన్ని కూడా ప్రచారానికి కేన్వాస్ చేసేస్తున్నారు కొందరు. వివిధ బ్రాండ్ల లోగోల్ని టాట్టూ వేయించుకుని జనసమ్మర్దాల్లో కనిపించడం విదేశాల్లో ఇప్పుడు ఎక్కువైంది. బ్రాండెడ్ పర్సు చేతిలో ఉంటేనో, బ్రాండెడ్ దుస్తులు ధరిస్తేనో స్టేటస్ సింబల్‌గా తలెకెత్తుకోవడం ఒక వ్యసనమైతే దీన్ని ఏకంగా ఒంటికి ఎక్కించేసి మరీ అద్దె కట్టేస్తున్నారు.



గ్రీటర్స్

మనదేశంలో అంతగా కనిపించదు కానీ విదేశాల్లో ఈ తరహా ఉద్యోగాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ముఖ్యంగా జపాన్‌లో మరీనూ. షాపుల ముందు నిల్చుని వినియోగదారుల్ని లోపలకు ఆహ్వానించడా నికి వీరు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. మనవైపున హుందాగా అనిపించినా విదేశాల్లో మాత్రం వెర్రి అంతాఇంతా కాదు. కుందేలు చెవులు, తోకలు తగిలించినట్టు దుస్తులు వేసుకుని కొందరు, ఇబ్బందికరంగా ఉండే కాస్ట్యూమ్స్ వేసుకుని మరికొందరు షాపుల ముందు తచ్చాడుతూ దారిన పోయేవాళ్లను ఏదో రకంగా షాప్‌ను సందర్శించేలా చేయాలి. నిలువు కాళ్లమీదే వారి షిఫ్టు అంతా పూర్తవుతుంది. వీరిని ఆటపట్టించే జులాయిలు ఎంతో మంది. అవన్నీ షాపు యజమానికి సంబంధం లేదు. ఎప్పటికప్పుడు మారే ఆఫర్లను, ప్రకటనలను షాపు ముందు వివిధ విన్యాసాలు చేస్తూ ప్రదర్శిస్తుండాలి.

మన పలకరింపు

ముందే అనుకున్నట్టు ఇక్కడి ఫంక్షన్లలో వింత పలకరింపులను మొహమాటం లేకుండా అద్దెకు తెచ్చేస్తున్నారు. పైకప్పుకు తగిలేంత ఎత్తులో స్టూళ్లను వేసి అమ్మాయిని నించోపెట్టి మొత్తం కవరయ్యేలా భారీ కాస్ట్యూమ్‌ను ధరింపజేస్తారు. గంటలపాటు అలాగే కదలకుండా చిరునవ్వులు చిందిస్తూ వాళ్లు నించోవాలి. పిల్లల కోసమని చెప్పినా వారంతెత్తున ఉన్న వారిని

తల
చాన
మా
పెట్టి
ఇబ్బ

షేక్‌హ్యాండ్ అడిగిస్తుంటారు. ఈ
దుస్తులు వంగి పిల్లలకు చేయి అ
ఇబ్బందికరంగా ఉంటాయి. ఈ ఆ
పట్టుకుని రెడీ అయిపోయేవారిదో

వ్యక్తే బిల్‌బోర్డ్

రోడ్డు మలుపులు, కూడళ్ల వ
కనిపిస్తున్నారు. ఫలానా షాపు, ఫ
అన్నట్టు ప్లకార్డులను పోలిన మా
వాటికి తగ్గట్టు దుస్తులు తొడిగి శ
కొందరు బిల్‌బోర్డ్‌లను ఒంటికి తొ
తిరుగుతుంటారు. ఈ ప్రచార శైల
వచ్చేసింది. రాత్రుళ్లు కూడా స్పెష
తగిలించుకుని నడుస్తూ వెళ్లే వార
తగులుతుంటారు. లేదా కంపెనీ
బొమ్మల్ని మెడకు వేలాడదీసుకుని
అప్పజెప్పేస్తున్నారు.



అల్లరి గుంపుల కామెంట్లను పట్టిం
హావభావాలతో బ్రాండ్ల గురించో,
నిర్వహించే కార్యక్రమం గురించో,
నటించాల్సిందే, నర్తించాల్సిందే. ఫ
తీస్తున్నా పట్టించుకోకూడదు.

అంగ వైకల్యమూ అదనపు ఆకర్షణే!

మరగుజ్జులు, భారీకాయులు, అవయవాల్లో మార్పులున్న వారిని వెతికి మరీ పట్టుకుని పిచ్చి ప్రచారాలకు వాడటం ఈ



...ేదం..?

ౖకెత్తి చూసి ఆనందించే
లేదు. కానీ మిగతా బ్యాచ్‌లు
ం సెల్ఫీలతో చిరాకు
చేస్తాయి. వారిని మరింత
ని పెట్టేందుకు పిల్లలతో
ంట్ మేనేజర్ అప్పజెప్పే
ించలేనంత
కాశం కోసమే ఫోన్లు
పైశాచిక ఆనందం.





ఇప్పుడు కొందరు
ానా రెస్టారెంట్ ఇటువైపు
సూచీలను పట్టుకుని,
లా నించొని ఉంటారు.
ెగి జనసమ్మర్దాల్లో
మన తెలుగు ఊళ్లలో కూడా
్ లైటింగ్ వ్యవస్థతో బోర్డుల్ని
మన నగరాల్లో
ోగోల బొమ్మల్ని, వస్తువుల
రపత్రాలు పంచే పని

వీధి ప్రదర్శనలు

మరి కొందరు మరో అడుగు ముందుకేసి చిట్టిపొట్టి డ్రెస్సులు, పిచ్చి కాస్ట్యూమ్స్‌తో ఎంత ఆకట్టుకోగలిగితే అంత అన్నట్టు రకరకాల వేషాలు వేయించి వీధుల్లో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు.
ుకోకుండా విచిత్రమైన
ాబోయే ఈవెంట్ గురించో,
షాపుల్లోని స్పెషల్స్ గురించో
్ పిచ్చి భంగిమల్లో ఫోటోలు
మధ్య
మరీ
ఎక్కువైంది.
పార్టీల్లోనూ వీరితో వింత వింత ప్రదర్శనలిప్పిస్తూ అతిథుల్ని మెప్పించాలనే ఉబలాటం కొందరిది. వీరిని ఆటపట్టిస్తూ పిల్లల గుంపు చేరితే నవ్వుతూ పక్కా ఎంటర్‌టైన్ అయ్యేవారే ఎక్కువ. అవసరమైతే పిల్లలతో కలిసి మరింత ఆటకాయితనాన్ని పబ్లిగ్గా ప్రదర్శించేస్తుంటారు.



సరదాలకు టార్గెట్

ఇప్పుడు కొన్ని రిక్రియేషన్, థీమ్ పార్కుల్లో హ్యూమన్ టార్గెట్ అనే కొత్త పోస్టు వినిపిస్తోంది. పిల్లల్ని సరదాల్లో నింపేందుకు ఏంచేసేందుకైనా తగ్గట్లేదు. చివరకు సాటి మనిషిని తాళ్లతో కట్టేసో, గోడకు బిగించో పెయింట్ బాల్ టార్గెట్ త్రో ఆటలు ఆడిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఎంత ఇబ్బంది పెడుతున్నా కిమ్మనకుండా జీవచ్ఛవంలా ఏదైనా ఓ భంగిమలో కదలకుండా నిల్చోవాలి. మరికొన్ని చోట్ల నల్లరంగును వద్దనుకుండా ఒంటిపై పోయించుకోవాలి.

ఈ ప్రచారాలు, సరదాలు, ఉల్లాసాలు, ఎంటర్‌టైన్‌మెంట్ల పిచ్చి ఎంతదాకా వెళ్లిందో చెప్పాలంటే పోర్చుగల్ సంగతి చెప్పాల్సిందే. బస్టాప్‌ల దగ్గర, మెట్ల వరస దగ్గరో ఎవరో హత్యచేయబడి పడున్నట్టు ఉంటారు. లేదా ప్రమాదవశాత్తు మరణించినట్టు నెత్తుటి గాయాలతో పడిపోయి ఉంటారు. తీరా వారి దగ్గరకు వెళితే అకస్మాత్తుగా పైకిలేచి మీ చేతిలో ఓ కరపత్రమో, బ్రోచరో, ఫ్లైయరో పెడతారు. ఇదీ ఓ రకం ప్రచారమే. సాటి వ్యక్తి ఉనికిని గుర్తించకుండా, మనిషి అనే లెక్కలోకి తీసుకోకుండా ఇష్టానుసారం వ్యంగ్యంగానో, ఇబ్బందికరంగానో కార్యక్రమాల్ని రచించి ఉద్యోగాలు చేయిస్తున్నారు. దీనికి క్రియేటివిటీ అనే పెద్ద మాటను వాడేసి ఈ నౌకరీల్ని గ్లామరైజ్ చేస్తున్నారు. పనే దైవం, తక్కువ పని అంటూ ఏది ఉండదని నీతులూ వల్లెవేసేస్తుంటారు. ఓ సారి ఈ ఉద్యోగాలు చేస్తున్నట్టు ఎవరిని వారు ఊహించుకుంటే అవి మనసుకు ఎంత కష్టంగా ఉంటాయో అర్థమవుతుంది. అందుకే ఈ ఉద్యోగాలు చేసేవారి మానసిక సంఘర్షణలు, భావోద్వేగాలు, డిప్రెషన్లు, వ్యక్తిగత, కుటుంబ, సామాజిక సమస్యల చిట్టాను ఏకరువు పెట్టడంలేదు. సింపుల్‌గా వారి బోర్డు తగిలించుకుని నలుగురిలో నిలబడితే తెలిసిపోతుంది. ఆ తర్వాత సెల్ఫీలు గట్రా కానిచ్చేయొచ్చు. ఏమని చెప్పినా ఇలా వ్యక్తిత్వానికి అద్దె కట్టే ఉద్యోగాలు మిగతా చోట్లా చాలానే ఉన్నాయి. అవి వింటానికి, చూడటానికి మరింత జుగుప్సాకరంగా ఉంటాయి. ఇలాంటి వికృత పోకడల్ని ప్రోత్సహించకుండా చూడాల్సింది వినియోగదారుడే. వాటికి డిమాండ్ పెరగకుండా మన వరకూ రాకుండా ఆదిలోనే దెబ్బ కొట్టాల్సింది మన విజ్ఞతే.

- జేమ్స్

నాన్న.. చెమట చుక్క దేహం

మార్కెట్‌లో దొరకడుగానీ
తూకంతో తూగుతాడు

ఇంటికాళ్లకు చెప్పులవుతాడు
ప్రతిపూటా నాలుగు గిద్దల బియ్యమవుతాడు

కాసేపాగితే నాన్నొస్తాడని అమ్మ భయపెట్టడం ఉత్త అబద్ధం
నిన్నూ, నన్నూ ముద్దుపెట్టుకోవడం కోసం మొదటిసారి మీసాలు తీశాడు
మనం నిద్దురపోతున్నప్పుడు కోపాన్ని మింగటం నేర్చుకున్నాడు

ప్రపంచమంతా గుండె గుప్పెడే ఉంటుందంటారు
నువ్వసలు నమ్మకు
నాన్న గుండె మాత్రం ఇల్లంత ఉంటుంది

నీకెప్పుడన్నా కవిత్వం రాద్దామనిపిస్తే
నాన్న పేరో పదిసార్లు రాయి
ఆ కాగితం ఎందుకు కవిత్వం కాదో చూద్దాం

నాన్న మనలోకి ప్రవహిస్తాడు
నది పాయలై చీలడం చూసుంటావు కానీ
నది పాయలో కలవడం ఇక్కడే చూస్తావు

బాధల పుస్తకానికి నవ్వుల అట్టేసుకుంటాడు
ఓ ఇంటికి తనను తాను కట్టేసుకుంటాడు

నాన్నిచ్చిన నోట్లపై గాంధీ ఉండటం బానే ఉంది కానీ
నాన్నే ఉండుంటే ఇంకెంత బావుండేదో కదూ...

నాకు తెలిసీ నాన్నంటే
చెమట చుక్క దేహం
ఆకలే తెలియని శ్రామికుల సమూహం

నాన్నలకు ఆకలవ్వదని గిన్నిస్‌బుక్‌లో ఎలానూ రాయలేదు
కనీసం గుండెల మీద రాసుకుందాం

నాన్నలూ, వాళ్ల నాన్నలూ అసలు నాన్నలంతా
యుద్ధం కోసం సిద్ధం చేయబడ్డ ప్రేమలనీ
నగ్న స్వేద బిందువుల సమూహమనీ రాసుకుందాం...

- సిద్దార్థ కట్టా
9642108756

కవిత్వం

వంతెన

నీ ఆలోచనలు చుట్టుముట్టగానే
అక్షరాలన్నీ మెదడులో కవిత్వమై మొలుస్తాయి
ఘనీభవించిన ఆలోచనల నుండి
ఉదయకిరణాల వేడిమికి
మెలమెల్లగా మంచుముద్ద కరిగినట్టు

ఒక్కొక్క అక్షరమూ
మనసు సిరాలో మునిగి
కాగితమంతా పరచుకుంటాయి
అచ్చం నీ నవ్వులాగే
ఆకాశం నుండి తెగిపడిన నక్షత్రాల్లా

దట్టమైన మబ్బుల్లో దోబూచులాడుతున్న చంద్రుడు
కారడవిని సైతం తన వెన్నెలతో వెలిగిస్తాడు
అప్పుడు నేను అన్వేషినై
నీ అడుగులను వెంటాడుతూ
రాలిపడిన ఆకులసవ్వడిలో నీ హృదయాన్ని వింటాను
కనిపించని మధురానుభూతిని మనసు మోస్తుందప్పుడు

నీకు తెలియదు కానీ
నా రెప్పలపై ప్రేమవంతెన కడతావు
నీ ఆలోచనల వాగుపై నడుచుకుంటూ వెళ్లమని

-వైష్ణవి శ్రీ
8977237345

రుతుపవనాల గురుతులు

- రుతుపవనం 'మాన్సూన్' అనే పదం అరబిక్ పదం 'మౌసమ్(రుతువు)' నుంచి గ్రహించబడింది. మౌసమ్ అంటే రుతువు లేదా గాలి దిశలో వచ్చే మార్పు.
- సంవత్సర కాలంలో కొన్ని వర్షపు విరామాలని మాన్సూన్ బ్రేక్ అని పిలుస్తారు.
- మాన్‌సూన్(రుతుపవనం) అనే పదాన్ని మొట్టమొదట బ్రిటిష్ ఇండియాలో ఉపయోగించారు. ప్రస్తుతం భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తోపాటు కొన్ని పొరుగు దేశాల్లో ఈ పదం వాడుకలో వుంది.

- రుతుపవనాల సమయంలో ఇప్పటి వరకు దాదాపు ఐదు లక్షల మెరుపు దాడులు సంభవించాయి. మెరుపుల వల్ల ప్రాణాలు కోల్పోయినవారు 1,755 మంది అనేది ఒక నివేదిక.
- కాలానుగుణంగా చల్లని గాలుల దిశలో వచ్చే మార్పులే ఈ రుతుపవనాలు.

- రుతుపవనాల ఆరంభం 'బర్స్టింగ్ ఆఫ్ మాన్సూన్స్' అనే ప్రక్రియపై ఆధారపడి వుంటుంది.
- రుతుపవనాల సమయంలో అతి వర్షపాతం, వరదలు వంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయి.
- రుతుపవనాల కాలంలో వర్షపు నీటిలో దాదాపు 30 శాతం నీరు చేరుకునేది నైరుతి అమెరికాలోని ఆరిజోన ప్రాంతంలోనే.
- మన దేశంలో వ్యవసాయం 33 శాతం మాత్రమే సాగునీటి వనరులపై సాగుచేయబడుతోంది.
- వాతావరణ విభాగం భారత దేశంలో మొట్టమొదటగా 1886 జూన్ 4న ప్రారంభమయ్యింది. అప్పటి నుండి నేటి వరకు 23 కరువు సంవత్సరాలు నమోదయ్యాయి.

- మన జి.డి.పిలో రుతుపవనాల వాటా 14 శాతం.
- రుతుపవనాలకి సంబంధించి మనదేశంలో 25 కోట్ల మేర అక్రమ బెట్టింగ్ మార్కెట్ నిర్వహించబడుతోంది.
- టెక్సాస్, న్యూ మెక్సికో, ఆరిజోనా ప్రాంతాల్లో జూన్ 15 - సెప్టెంబర్ 30 మధ్య రుతుపవనాలు వీస్తాయి. ఆరిజోనాలో ఈ సమయంలో బలంగా వీచే గాలుల ద్వారా వచ్చి చేరే దుమ్ముతో వందల అడులమేర ఒక ధూళి గోడ ఏర్పడుతుంది. అరుదైన ఈ దృశ్యాన్ని చూసేందుకు ఎంతో మంది రుతుపవనాల సమయంలో అక్కడికి చేరుకుంటారు.

- రుతుపవనాల ద్వారా వీచే గాలుల తీవ్రతను బట్టీ చిన్న దుమ్ముతో కూడిన గాలుల నుండి పెద్ద పెద్ద తుఫానులు సంభవిస్తాయి.
- రుతుపవనాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు దేశంలో దాదాపు 83.3 కోట్ల మంది.



క థ

గోవిందా... గోవింద!!

రాజశేఖర్ చెరుకూరి

9848664587

"తాతయ్యా... నీకు ఎవరో ఫోన్ చేశారు..." మనవరాలు వచ్చి సెల్‌ఫోన్ చేతిలో పెట్టి వెళ్ళిపోయింది ఇంత పొద్దున్నే ఎవరబ్బా.. అనుకుంటూ "హలో" అన్నాడు రాయుడు గారు.

"నమస్తే ప్రెసిడెంట్ గారు.." అన్న అవతలి గొంతు గుర్తుపట్టలేక "ఎవరండీ.." అన్నాడు రాయుడు గారు.

"నేనండీ వీర రాఘవులు గారి అబ్బాయిని... శివ శంకర్‌ని... అమెరికా నుంచి మాట్లాడుతున్నాను.." అన్నాడు శివ శంకర్.. ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగింది రాయుడు గారికి. ఒక్కసారి పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోబోయి తమాయించుకుని "చెప్పు నాయనా.. ఎలా ఉన్నావు.. నీ భార్యా పిల్లలూ అందరూ బాగున్నారా.." అన్నాడు రాయుడు గారు.

అందరూ బాగున్నారు రాయుడు గారు...మీరు ఎలా ఉన్నారు? అసలు విషయం చెప్పబోయే ముందు తప్పక ఏదో అడగాలి అన్నట్లు మొహమాటానికి అడిగాడు శివ శంకర్.

"నేను మీకు వేసిన ఉత్తరం చేరిందా... లేదా" ఇంకా ఏదో మాట్లాడబోతున్న రాయుడు గారిని తిరిగి ప్రశ్నించాడు శివ శంకర్.

"ఉత్తరమా..ఏమీ అందలేదు బాబు... ఎప్పుడు రాశావు? ఇంతకీ ఏమిటీ విషయం.." అన్నాడు రాయుడు గారు.

"అలాగా..సర్లేండి..నేను ఎలాగూ వచ్చేవారం ఇండియా వస్తున్నాను. అప్పుడు తీరికగా మాట్లాడతాను" అని ఫోన్ పెట్టేశాడు శివ శంకర్.

"చిన్నారీ.. మీ నాన్న ఎక్కడ ఉన్నాడో పిలువమ్మా" అన్నాడు మనవరాలితో రాయుడు గారు. "ఇక్కడే ఉన్నాను నాన్నా.. చెప్పండి" అన్నాడు రాయుడి గారి అబ్బాయి సంజీవి.

"అమెరికా నుంచి నాకేమన్నా ఉత్తరం వచ్చిందా నాయనా" అడిగాడు రాయుడు గారు. కొడుకు నీళ్ళు నమలడం చూసి... "నిన్నే అడుగుతుంది..." అని మళ్ళీ అడిగాడు రాయుడు గారు. "అవును న్నాన గారు వచ్చింది. అయినా మీకు చూపించాల్సినంత గొప్ప విషయం అందులో లేదు లెండి... అందుకే చూపించలేదు" అన్నాడు సంజీవి.

"నాకు వచ్చిన ఉత్తరం నువ్వు చదివింది కాక మళ్ళీ నాకే నీతులు చెప్తావా...వెళ్ళి ఆ ఉత్తరం తీసుకురా..." అన్నాడు రాయుడు గారు చిరు కోపం ప్రదర్శిస్తూ...

కొడుకు తెచ్చి ఇచ్చిన ఉత్తరం చదివి రాయుడు గారు ఆలోచనలో మునిగిపోయారు. చాలా సంవత్సరాల క్రితం శివ శంకర్ నాన్న వీర రాఘవులు గారు కొడుకు అమెరికా నుంచి వచ్చి ఊరిలోనే ఒక హాస్పిటల్ కట్టుకుని సేవ చేయాలని కోరుకునే వారు. శివ

శంకర్‌కి ఇది ఏ మాత్రం ఇష్టం ఉండేది కాదు. ఈ విషయమై స్థలం సేకరించి ఎప్పటికయినా కొడుకు ఇండియా వచ్చే అవకాశం లేదని గ్రహించి ఆ స్థలాన్ని ఊరికి దానం చేస్తున్నట్లు గ్రామాధికారులకు చెప్పాడు. వీర రాఘవులు గారు ఎంతో మందికి ఊరిలో సహాయం చేయడం... చదువు చెప్పించడం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఊరికి రాయుడు గారే ప్రెసిడెంటు.

అలా ఆలోచిస్తూ మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి ఉత్తరం గురించి ఆలోచించడం మొదలు పెట్టాడు రాయుడు గారు. ఇప్పుడు ఇన్ని రోజుల తర్వాత వీర రాఘవులు గారి అబ్బాయి మళ్ళీ ఉత్తరం రాసి వాళ్ళ నాన్న గారు దానం చేసిన స్థలం తిరిగి తనకు ఇవ్వమని, అందులో ఒక కళ్యాణ మండపం కట్టాలని అనుకుంటున్నానని ఊరిలో జరిగే పెళ్ళిళ్ళకు మాత్రం ఉచితంగా ఇస్తానని అన్నాడు.

శివ శంకర్ చిన్నప్పుడే అమ్మ చనిపోతే... వీర రాఘవులు గారి ఒక్కగానొక్క బిడ్డ అయిన శివశంకర్‌ని ఊరిలో వారే అందరూ ముద్దు చేసి ప్రేమను పంచారు. ఇప్పుడు అతని కోరిక ప్రకారం చేసినా పచ్చటి పొలం కాంక్రీటుగా మార్చడం తలచుకుంటే చాలా బాధగా ఉంది. ప్రతి సంవత్సరం ఆ పొలాన్ని ఊరిలో ఒక రైతు దత్తతు తీసుకుని ప్రతిఫలం ఆశించకుండా పంట పండిస్తున్నారు. దానిలో పండే పంట ఊరిలో పేద వారికి ఆసరాగా ఉండటం ఎన్నో సంవత్సరాలుగా వస్తున్న ఆనవాయితీ. అయినా వీర రాఘవులు గారు రాత పూర్వకంగా ఏమీ ఆ పొలం ఊరికి రాసివ్వలేదు. తన కొడుకు తన చివరి దశలో అమెరికా నుంచి వచ్చినప్పుడు మాత్రం ఆ పొలం ఊరికి రాసిచ్చినట్లు మాట మాత్రంగానే చెప్పారు. ఈ విషయం రాయుడు గారికి మాత్రమే తెలుసు. ఆ రోజుల్లో పొలానికి పెద్ద విలువ లేక పోవడంతో శివశంకర్ కూడా పెద్ద అభ్యంతరం చెప్పలేదు. ఏదో మాట మీద గౌరవమే ఇన్నాళ్ళూ నడిచింది. మారిన కాల పరిస్థితుల్లో హైవేకి దగ్గరగా ఉన్న ఆ రెండెకరాల పొలం విలువ బాగానే పెరిగింది. ఇప్పుడు కూడా శివశంకర్ తనని అడగాల్సిన అవసరం లేదు. కానీ అతనికి కూడా లీగల్‌గా ఇది ఊరిది కాదు తనదే అని తెలిసి ఉండక పోవచ్చు. అందుకే ఊరి పెద్దగా నా సహాయం కోరాడు అని రాయుడికి అర్థమవుతుంది. శివ శంకర్ కూడా ఊరికి మంచి చేసే పని చేస్తాను అంటున్నాడు కాబట్టి అభ్యంతరం చెప్పడానికి ఏమీ కారణం కనపడలేదు రాయుడు గారికి. ఊరిలో పిల్లలకు పెళ్ళి చెయ్యడానికి తండ్రులు పడే కష్టాన్ని చూస్తుంటే ఈ కళ్యాణ మండపం కట్టడం కూడా ఒకందుకు మంచిదే అనిపించింది.

శివ శంకర్ అమెరికా నుంచి వచ్చి రాయుడు గారిని కలిశాడు. ఉత్తరంలో రాసిన విషయమే మళ్ళీ చెప్పాడు. ఊరి పెద్దలకు, ఎమ్మార్వోకి చెప్పి భూమి తిరిగి తనకు ఇప్పించాల్సిందిగా కోరాడు. ఇంక విషయం దాచి ప్రయోజనంలేదని గ్రహించిన రాయుడు గారు నిజం చెప్పారు. అది ఇంకా వారి తండ్రి గారి పేరు మీదే ఉందని, కాబట్టి అది పరుషంగా అందామని అనుకున్నట్లు ఉన్నాడు. ఏమి గుర్తుకు వచ్చిందో కానీ...తమాయించుకుని నవ్వు ముఖం పులుముకుని "అలాగా...అయితే ఇంకా మంచి విషయం" అని అన్నాడు.

"రాయుడు గారు... ఆరు నెలల్లో మా అబ్బాయి పెళ్ళి అనుకుంటున్నాను. అప్పటి లోపు కళ్యాణమండపం కట్టి అందులో మొదటి పెళ్ళి మా అబ్బాయిదే చేయాలి. మా ఆవిడకి కూడా ఇండియాలో తన కొడుకు పెళ్ళి జరిపించాలని కోరిక" అన్నాడు శివ శంకర్. "చాలా మంచిది నాయనా. అలాగే ఊరిలో వారి పెళ్ళిళ్ళకి ఉచితంగా కళ్యాణ మండపం ఇస్తానని చెప్పిన నీ మాట చాలా గొప్పది. ఇది నీ ఒక్కడి పనిగా భావించకు. డబ్బు పరంగా సహాయం చెయ్యలేము కానీ... ఊరిలో అందరూ తలా ఒక చెయ్యి వేసి అనుకున్న సమయంలో పని పూర్తి చేయించే బాధ్యత నాది" అన్నాడు రాయుడు గారు. "సంతోషం రాయుడు గారు. మళ్ళీ కలుస్తాను.." అని వెళ్ళిపోయాడు శివ శంకర్. వెనక నుంచి వచ్చిన సంజీవి "ఆయన మాటలు నువ్వు నమ్ముతున్నావా నాన్నా" అన్నాడు. "ఈ విషయంలో నమ్మడం వల్ల ఎవరికీ వచ్చే నష్టం లేదు సంజీవి..." అని రచ్చ బండ వైపు అడుగులేశాడు రాయుడు గారు. "నీ నమ్మకం నిజమవ్వాలని కోరుకుంటున్నాను నాన్నా..." అనుకున్నాడు సంజీవి మనసులో. చూస్తుండగానే ఆరు నెలలు



ఇట్టే గడిచిపోయాయి. రాయుడు గారి మాటల మీద గౌరవంతో ఊరు కూలీలతో పాటు తాము కూడా మమేకమై దగ్గరుండి తమ ఇల్లు లాగా కట్టడానికి చెయ్యాల్సినంత సహాయం చేశారు.

అన్నట్టుగానే శివ శంకర్ మొట్ట మొదటిగా ఆ కళ్యాణ మండపంలో అమెరికాలో పుట్టి పెరిగిన తన కొడుకు పెళ్ళి అంగరంగ వైభవంగా జరిపాడు. జిల్లాలోని ఉన్నతాధికారులందరూ కదిలి వచ్చారు కానీ... కళ్యాణ మండపం కట్టడానికి ఎంతో సహాయం చేసిన ఊరిలో ప్రజలని ఎవ్వరినీ మాట మాత్రంగానైనా పిలవలేదు. మరీ బాగోదన్నట్లు రాయుడు గారికి మాత్రం ఒక వ్యక్తి చేత శుభలేఖ పంపారు. కనీసం ఇంటికి వచ్చి పిలిచే తీరిక కూడా లేదా అని రాయుడు గారి మనసునొచ్చుకున్నా... ఊరికి జరగబోయే మంచి తలచుకుని మొహమాటంగానే పెళ్ళికి వెళ్ళారు. అక్కడ పలకరించే వారే లేకపోగా ఎందుకో వేరే మానవ రహిత ప్రపంచంలోకి వచ్చిన భావన కలిగింది ఆయనకి.

పెళ్ళి జరగగానే శివ శంకర్ కళ్యాణ మండపానికి ఒక మేనేజర్‌ని పెట్టి రాయుడి గారికి మాట మాత్రం చెప్పకుండానే అమెరికాకి వెళ్ళిపోయాడు. కనీసం అందులో ఊరి వారికి ప్రవేశం కూడా లేనంత కట్టుబాట్లు చేశాడు.

ఆ తర్వాత అందులో ధనవంతుల పెళ్ళిళ్ళు మాత్రమే జరగటం మొదలయ్యింది. ఊరిలో ఒకరి పెళ్ళి గురించి మండపం అడగటానికి ప్రయత్నించి రాయుడు గారు విఫలమయ్యారు. ఇది చూసిన సంజీవి "నేను ముందే చెప్పాను కదా నాన్న గారు... ఎప్పుడో అమెరికా వెళ్ళినవాడు ఇన్ని రోజుల తరువాత ఊరి మీద ప్రేమ ఒలకబోసినప్పుడే మీరు అర్థం చేసుకోవాల్సింది. మనుషుల్ని గుడ్డిగా నమ్ముకుంటూ పోయే రోజులు ఎప్పుడో పోయాయి" అని తండ్రి బాధ చూడలేక బయటకి వెళ్ళిపోయాడు. జరిగింది ఆలోచిస్తూ రగిలిపోయాడు సంజీవి. శివ శంకర్‌కి ఎలా అయినా బుద్ధి చెప్పాలని అనుకున్నాడు. ఇంతలో శివ శంకర్ వాళ్ళ అబ్బాయికి జరిగిన పెళ్ళి విడాకులకు దారి తీసినట్లు అమెరికాలో ఉంటున్న వాళ్ల దూరపు బంధువు ద్వారా తెలుసుకున్నాడు సంజీవి. వెంటనే ఒక ఉపాయం తట్టి అమలులో పెట్టాడు. తన స్నేహితుడు రాంబాబుని పిలిచి చెవిలో ఏదో చెప్పాడు. ఆ పథకం ప్రకారం రాంబాబు రోజూ ఊరి మొదట్లోకి వెళ్ళి కాపలా కాయడం మొదలు పెట్టాడు. అది అసలే మంచి పెళ్ళిళ్ళ సీజన్. ఒక రోజు ఏదో పెద్ద కారు రావడం చూసి రెండు మేకలను ఆ దారిలోకి వదిలాడు. మేకలు అడ్డు రావడంతో ఆ కారు ఆగింది. ఇంతలో ఆ మేకలను అడ్డు తీస్తూ లోపలికి చూస్తూ రాంబాబు అడిగాడు వాళ్ళని "ఎవరిని కలవాలి బాబు మా ఊళ్ళో మీరు." అని. కొత్తగా కట్టిన కళ్యాణ మండపం దగ్గరికి...మా అమ్మాయి పెళ్ళి కోసం మాట్లాడదామని పక్కఊరి నుండి వస్తున్నాం...ఇంకా ఎంత దూరం ఉంది బాబూ" అని అడిగాడు కారులో ఉన్న వ్యక్తి.

"అయ్యో...మీ అమ్మాయి పెళ్ళి కోసమా..." అని జాలిగా ముఖం పెట్టి "ఇంకొంత దూరం ముందుకు వెళ్ళారంటే వచ్చేస్తుంది" అని అన్నాడు. రాంబాబు ముఖకవళికలు గమనించిన ఆ వ్యక్తి.. అదేంటి అలా ముఖం పెట్టావ్ అన్నాడు. "ఏమీ లేదు లేండి" అని మాట దాటెయ్యబోయాడు రాంబాబు. "లేదు..ఏదో దాస్తున్నావు... పర్లేదు

పెళ్ళి జరగగానే శివ శంకర్ కళ్యాణ మండపానికి ఒక మేనేజర్‌ని పెట్టి రాయుడి గారికి మాట మాత్రం చెప్పకుండానే అమెరికాకి వెళ్ళిపోయాడు. కనీసం అందులో ఊరి వారికి ప్రవేశం కూడా లేనంత కట్టుబాట్లు చేశాడు.

నిజం చెప్పు" అన్నాడు ఆ వ్యక్తి.

"ఈ మధ్య ఆ కళ్యాణ మండపంలో ఎవరికి పెళ్ళి జరిగినా నెల తిరగకుండా వారి ఇంట్లో ఇబ్బందులు వస్తున్నాయి. ఇప్పటికే మాకు తెలిసిన మూడు జంటలు విడిపోయ్యాయి. ఒక పెళ్ళి కూతురు అయితే ఆత్మ హత్య చేసుకుని పిశాచమై దాన్లోనే తిరుగుతుందని అంటున్నారు" అన్నాడు రాంబాబు బాధ ప్రదర్శిస్తూ. ఆ మాట వింటూనే ఒక నమస్కారం పెట్టి వచ్చిన వాళ్ళు వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు.

ఇక రోజూ ఇదే తంతుతో రాంబాబు కళ్యాణ మండపం కోసం వచ్చిన వారినందరినీ వెనక్కి పంపడం చేశాడు. ఇది ఆ నోటా ఈ నోటా పాకి చివరికి పేపర్లో కూడ ఎక్కడంతో ఆ ఊరి కళ్యాణ మండపం వైపు చూసేవారు కరువయ్యారు. కోట్లు ఖర్చు చేసి కళ్యాణ మండపం కట్టించిన శివ శంకర్ ఈ విషయం విని హతాశుడయ్యాడు. చివరికి రాయుడు గారి దగ్గరికి వచ్చి మొరపెట్టుకోగా ఈ విషయం ఎలా పాకిందో తెలియని రాయుడు గారు తానేమి చెయ్యలేనని చెప్పారు. ఇంతలో సంజీవి "శివ శంకర్ గారు... ఇంక ఈ ఊరిలో కళ్యాణ మండపం కోసం ఎవరూ రారు. ఎన్నాళ్ళుగానో ఈ ఊరి ఆసుపత్రికి శాశ్వత భవనం లేదు. పట్నం లోని కొంతమంది డాక్టర్లు వారానికి ఒక రోజు వచ్చి వైద్యం చేయడానికి ఆసక్తి చూపించినా సరైన భవనం లేక రాలేక పోతున్నారు. అలాగే ఊరిలో ఉన్న ఒక పాఠశాల శిథిలావస్థలో ఉంది. దయ చేసి కొన్ని సంవత్సరాలు ఈ కళ్యాణ మండపాన్ని ఆసుపత్రి కోసం మరియు పాఠశాల కోసం ఇస్తే మీ పేరు ఈ ఊరి వారందరూ చెప్పుకుంటారు. పల్లెటూళ్ళో పుకార్ల వల్ల వచ్చిన నమ్మకాలు మరుగున పడాలంటే చాలా సమయం పడుతుంది." అన్నాడు.

ఈ మాటలకి నవ్వాలో ఏడవాలో తెలియని శివ శంకర్ "సరే అలాగే కానివ్వండి..." అని విరక్తిగా అన్నాడు. కళ్యాణ మండపం మీద రాబడి రాకపోగా దాని నిర్వహణ కోసం ఎంతో ఎదురు ఖర్చు చేయాల్సి వస్తుంది అతనికి. వాణిజ్య రీత్యా కట్టడం వల్ల ప్రభుత్వానికి టాక్సులు అదనంగా కట్టాల్సి వస్తుంది.

"ఒక పది సంవత్సరాల పాటు హాస్పిటల్‌కి ఉచితంగా ఇస్తున్నట్లు ఇక్కడ సంతకం పెట్టండి. మీ కళ్యాణ మండపాన్ని చక్కగా మెయింటైన్ చేస్తూ తిరిగి పువ్వుల్లో పెట్టి అప్పగించే బాధ్యత మాది." అన్నాడు సంజీవి అప్పటికే సిద్ధం చేసిన కాగితాలు శివ శంకర్ ముందు పెట్టి.

చివరికి ఈ విధంగా అయినా ఊరికి మంచి జరుగుతున్నందుకు రాయుడు గారు చాలా సంతోషించారు. సంజీవి మాత్రం కనిపించని దెయ్యాలను తలచుకొని ఆనందంగా నవ్వుకున్నాడు. ✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

అరుదైన స్నేహం...



కోస్టారికాలోని లైమన్ ప్రావిన్స్‌లో వుంది సిక్వెర్స్ గ్రామం. ఆ ప్రాంతంలో ఉన్న ఓ నది పరిస్‌మినా. ఈ నదిలో కాలు పెట్టాలంటే అక్కడ అందరికీ చచ్చేంత భయం. నది అంత లోతు కూడా కాదు. నిజానికి ఈ భయం నీరంటే కాదు. అక్కడుండే పోచొ అంటే...ఇంతకీ పోచొ ఎవరో తెలుసా. చీటొ మొసలి నేస్తం..!! మరీ అలా ఆశ్చర్యపోకండి మీరు విన్నది నిజమే. ఈ ఇద్దరికీ దోస్తీ ఎలా కుదిరిందంటే... కోస్టారికాకి చెందిన మత్స్యకారుడు గిబర్టో షెడెన్ (చీటొ) 1991లో తన పడవలో చేపల వేటకు వెళ్ళిన చీటొకి ఐదు మీటర్ల పొడవున్న మొసలి కనిపించిందట. అప్పటికే బులెట్ గాయం కారణంగా దాని కంటి నుండి తీవ్ర

సరదాగా కుక్కనో, పిల్లినో పెంచుకునే వాళ్ళని చూసేవుంటారు. ఏనుగులు, ఎలుగు బంట్లు, సింహాలని మాలిమి చేసుకునే వాళ్ళ గురించి వినే వుంటారు... మరి మొసలితో సావాసం చేసే వారి గురించి ఎప్పుడైనా విన్నారా. అయితే మీరు కోస్టారికాకి వెళ్ళి తీరాల్సిందే ఎందుకంటే అక్కడ మొసలిని తన బెస్ట్ ఫ్రెండ్‌గా మార్చేసుకున్న చీటొ కనిపిస్తాడు. మొసలితో చీటొ చేసే రకరకాల విన్యాసాలని చూసేందుకు వచ్చిపోయేవారితో సిక్వెర్ గ్రామం ఇప్పుడో టూరిస్ట్ ప్రదేశంగా పేరుగడించింది. అంతే కాదు ఈ ఇద్దరి స్నేహబంధాన్ని చిత్రీకరించిన కొన్ని డాక్యుమెంటరీలు, చిత్రాలు కూడా వచ్చాయి. ఇంతకీ ఈ చీటొ ఎవరు? పోచొ(మొసలి)కి ప్రాణమిత్రుడిగా ఎలా మారాడో తెలియాలంటే ఇది మీరు చదవాల్సిందే..!!

రక్తస్రావమవుతోంది. ఆ మొసలిని అలా వదిలేయాలనిపించలేదు మన చీటొకి. కాస్త ధైర్యం చేసి తన మిత్రుల సాయంతో మొసలిని తన పడవలో ఎక్కించాడు. తనతో పాటు ఇంటికి తీసుకెళ్ళాడు. కట్టుకట్టాడు. ముద్దుగా పోచొ అని పేరు కూడా పెట్టాడు. పోచొ అంటే ధైర్యం అని అర్థం. తీవ్ర అనారోగ్యంతో వున్న పోచొకి చికెన్, చేపల్ని ఆహారంగా అందించేవాడు. ఆరు నెలల పాటు దగ్గరుండి వైద్యం చేశాడు. పోచొని ఎంతో ప్రేమగా చూసుకుంటూ మామూలు స్థితికి వచ్చేలా చేశాడు. ఆహారంతో పాటు తను చూపించిన అభిమానం పోచొ తొరిగి మామూలు స్థితికి వచ్చేందుకు దోహదపడింది. అలా కొద్ది కాలంలోనే ఆ మొసలి మన చీటొకి మాలిమి అయిపోయింది. తనని ప్రేమతో ముద్దాడేది. నిజానికి పోచొ కోలుకోడానికి తను చూపించిన ప్రేమే కారణం. పోచొ పూర్తిగా కోలుకున్నాక సాధారణ జీవనం కోసం దగ్గరలోని పరిస్‌మినా నదిలో వదిలి పెట్టాడు చీటొ. అయితే తర్వాతి రోజు తను నిద్ర లేచేసరికి తన వరండాలో కనిపించింది పోచొ. తొరిగి నదిలో వదిలిపెట్టినా చీటొని ఫాలో అయిపోయేదట ఈ మొసలి. ఇలా మొసలి చీటొని అంటి పెట్టుకుంటుండడంతో చీటొ భార్య తన నుండి విడిపోయింది. ఆ తర్వాత పోచొతో మరింత సేపు కాలక్షేపం చేసేవాడు. ఇద్దరి మధ్యా దోస్తీ మరింత పెరిగింది. 'పోచొ' అని పిలవగానే వేగంతో పరుగెత్తు కొచ్చేదట ఈ మొసలి. ఈ స్నేహబంధం ఇప్పటిది కాదు. దాదాపు 20 సంవత్సరాల ఆత్మీయబంధం వీరిది.

ప్రపంచానికి తెలిసిందిలా...

ఓ రోజు పరిస్‌మినా నది వద్ద ఒకతను కాస్త విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇంతలో పోచొతో కలిసి నదిలో ఈతకొడుతూ, రకరకాల విన్యాసాలు చేస్తూ కనిపించాడు చీటొ. ఆ విన్యాసాలకి ఫిదా అయిపోయాడు అతగాడు. మరుసటి రోజు మరికొంతమందిని వెంటబెట్టు కొచ్చాడు. అలా ఆ నోటా ఆనోటా చీటొ-పోచొ స్నేహం గురించి ఎక్కువ మందికి తెలిసింది. 2000 జులైలో కోస్టారికాలోని స్థానిక మీడియా 'చానెల్-7' వీరిద్దరిపై చిత్రీకరించిన వీడియోని ప్రసారం చేసింది. ఈ ఇద్దరూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చేసుకున్నారు. అలా అరుదైన ఈ నేస్తాలని చూసేందుకు వచ్చిపోయేవారితో సిక్వెరిస్ ఒక టూరిస్టు ప్రదేశంగా మారింది. వారాంతాల్లో పోచొతో కలిసి చీటొ చేసే విన్యాసాలని చూసేందుకు అమెరికా, చిలి, యు.కె నుండి వేలాదిగా జనం తరలి వచ్చారు. పర్యావరణ -టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ పోచొని చూసుకునే పూర్తి బాధ్యతల్ని చీటొకి అప్పగించింది. దక్షిణాఫ్రికాకి చెందిన ఫిల్మ్‌మేకర్ హారోక్స్ వీరిపై 'ద మ్యాన్ హు స్విమ్స్ విత్ ఎ క్రొకడైల్' అనే డాక్యుమెంటరీని తీశాడు. అప్పటికే వయసు పైబడడంతో 2011 అక్టోబర్ 2న పోచొ చనిపోయింది. స్థానికులతోపాటు వందలాది చిన్నారులు పోచొకి అంతిమ వీడ్కోలు పలికారు. ఈ స్నేహం చరిత్రలో నిలిచిపోయేలా పోచొ పార్థివదేహాన్ని సిక్వెర్స్ టౌన్ మ్యూజియం (ప్రదర్శనశాల)లో భద్రపరిచారు. పోచొ గుర్తొచ్చినప్పుడల్లా చీటొతోపాటు అక్కడి చిన్నారులూ ఈ మ్యూజియంను సందర్శిస్తుంటారు. పోచొ మరణానంతర పరిస్థితుల నుంచి కోలుకునేందుకు చీటొ మరో మొసలితో చెలిమిచేశాడు. పోచొ-2 అని పేరుపెట్టాడు. వన్యమృగ చట్టాల్లో చోటుచేసుకున్న మార్పులతో ఇప్పుడు ఎక్కువమంది ఇలా వన్యమృగాలతో సావాసాలు చేసేందుకు ముందుకొస్తున్నా... జంతువులని ప్రాణమిత్రులుగా చేసుకోవడం నిజంగా ఒక గొప్ప విషయమనే చెప్పుకోవాలి. ఆ ప్రేమే చీటొని వన్యప్రాణులకి దగ్గరచేస్తోంది.



ఒక ఉద్యమకారుని జీవితానుభవాలు

ప్రజల కోసం ఉద్యమించి వ్యక్తిగత జీవితాన్ని కూడా త్యాగం చేసి దానిని ప్రజాజీవితంగా మలచుకున్న ఉద్యమకారుల జీవితానుభవాల నుంచి నేటి తరం స్ఫూర్తి పొందాల్సిన అవసరం చాలా ఉంటుంది. అలాంటిదే ఈ పుస్తకం. ఇది ఒక ఉద్యమకారుని జీవితవిశేషాల సమాహారం. అయితే ఇందులో వ్యక్తిగత అంశాల కన్నా ప్రజాజీవితంలోకి ఆయన ఎలా వెళ్లారు? ఏఏ సందర్భాల్లో ఎలాంటి పోరాటాలు చేశారు. ఉద్యమాల నిర్మాణం ఎలా జరిగేది? తదితర విషయాలను ఈ పుస్తకం వివరిస్తుంది. దీనిని ప్రకాశం జిల్లా జె.పంగులూరుకు చెందిన నాగబోయిన రంగారావు అనే ఉద్యమకారుడు "ప్రజా ఉద్యమాలే ఊపిరిగా...." అనే పేరుతో రాసారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన తర్వాత చాలా మంది ప్రజారాజకీయాలకు కొంత దూరంగా మిగిలిపోతే... మరి కొంతమంది ఉద్యమాల్లోకి వచ్చారు. ఎమర్జెన్సీ తర్వాత 1977 చివర్లో రంగారావు కమ్యూనిస్ట్ రాజకీయాల వైపు వచ్చారు. సిపిఎమ్‌లో చేరడానికి ముందు డివైఎఫ్ ఏర్పాటు చేసి గ్రామస్థాయి నుంచే ఉద్యమావగాహనని పెంచుకున్నారు. ప్రజాకళల వైపు ఎలా ఆకర్షితులైంది కూడా ఈ పుస్తకంలో చక్కగా వివరించారు. ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రాంతాలను కార్యస్థానాలుగా మార్చుకుని పార్టీ ద్వారా నిర్వహించిన ఉద్యమాలను, పోరాటాలను ఈ పుస్తకంలో కళ్లకుకట్టినట్లు ఆవిష్కరించారు. పత్తి రైతుల ఆత్మహత్యలపై, ముండ్లమూడు భూపోరాటం, గంగన్నపాలెం భూపోరాటం, చందలూరు, తూమాడు దేవాలయ భూపోరాటాలు, కూకట్లపల్లి భూపోరాటం, కూలిపోరాటాలు, ఇంకొల్లు నూలుమిల్లు పోరాటాలు, మార్టూరు కార్మికుల పోరాటాలు, పొగాకు రైతుల ఉద్యమాలు, ప్రాజెక్టుల కోసం, సాగునీటి సమస్యలపై ఉద్యమాలు, నిర్వాసితుల పోరాటాలు, రైతుల ఆందోళనలు, కౌలురైతుల పోరాటాలు.....ఇలా ఎన్నో ఉద్యమాలను ఎలా నిర్వహించారు? వాటి వలన ప్రజలు పొందిన ఫలితాలేమిటో స్థూలంగా చర్చించారు. సీపీఎమ్ సీనియర్ నేత పుచ్చలపల్లి సుందరయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సమయంలో పార్టీలో చేరిన రంగారావు ఇప్పటికి కూడా అదే ఆశయాలతో కొనసాగుతూ యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని ఈ పుస్తకంలో ఆయన అనుభవాలు రుజువుచేస్తున్నాయి. ఉద్యమాలంటే ప్రచారార్భాటానికి మాత్రమే పరిమితమైపోతున్న ఈ తరుణంలో రంగారావు రాసిన ఈ పుస్తకం నిజమైన ప్రజాఉద్యమాల్లో ఎలాంటి ఒడుదుడుకులుంటాయో స్పష్టం చేసింది. పోరాటాలు, ఉద్యమాలు నిజాయితీగా చేస్తే తప్పకుండా ఆశించిన లక్ష్యాలను చేరుకుని మంచి ఫలితాలను ఇస్తాయని ఆయన పేర్కొనడం ఒక ఆశావహమైన దృక్కోణానికి తార్కాణం. చాలా వరకూ పుస్తకం నిండా ఫొటోలు, ఉద్యమాలు, పోరాటాల సమయంలో వచ్చిన వార్తాపత్రికల క్లిప్పింగులే ఆక్రమించాయి. లోపలున్న సమాచారం కూడా ఒక రిపోర్టు రాసినట్లే ఉంది. చదివించే శైలిలో మాత్రం లేదు. దీని వలన ఇది పాఠకులను అంతవేగంగా ఆకట్టుకుంటుందని అనుకోలేము. అయితే దీనిని సవరించి ఆకర్షణీయమైన శైలిలో రంగారావు తన అనుభవాలను మరింత వివరంగా రాసి నేడు ప్రజాపోరాటాల్లో ఉన్నవారికి అందించాల్సిన అవసరమైతే ఉంది.



పుస్తకం పేరు : "ప్రజా ఉద్యమాలే ఊపిరిగా..."
రచన: నాగబోయిన రంగారావు
పేజీలు : 160,
ధర: రూ. 25/-
ప్రతులకు:
నాగబోయిన రంగారావు
ఉండవల్లి, గుంటూరు జిల్లా
ఫోన్: 9490098955

- బెందాళం క్రిష్ణారావు



40 ఏళ్ల వర్షారణ్యం

సరిగ్గా నలభయ్యేళ్ల క్రితం బ్రెజిల్‌లోని సావ్ పావ్లోలో జీవవైవిధ్యానికి హానికలిగించే పరిణామాలు మొదలయ్యాయి. ఇది ప్రకృతి చేసిన విధ్వంసం కాదు. ముమ్మాటికీ అది మానవ తప్పిదమే.. మానవ మనుగడకి హానికలిగించే ఆ చర్యలకి మొక్కలు నాటి ఒక చక్కని పరిష్కారాన్ని చూపాడు ఆంటోనియో విసెంటి(83). ఇంతకీ అక్కడ ఏం జరిగిందంటే...

1970లో సావ్ పావ్లోలోని భూస్వాములు అందరూ తమ భూముల్లో పెరిగిన వృక్షాలన్నిటినీ నరికివేయాలని నిర్ణయించుకున్నారు. చకచకా పనులు మొదలయ్యాయి. పెద్ద పెద్ద వృక్షాలు ఒక్కొక్కటిగా నేలకొరిగాయి. ఇంతకీ ఇదంతా ఎందుకంటే అధిక రాబడుల కోసం. ఊరికే మొక్కలు పెరిగితే ఏం వస్తుంది. అదే నేలని చదును చేసి పశుపోషణకి షెడ్లని నిర్మించడం, పళ్ళతోటలని పెంచడం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బు గడించాలనేది భూస్వాముల అభిప్రాయం. ఆంటోనియో మాత్రం దీన్ని పూర్తిగా వ్యతిరేకించాడు. పచ్చటి ప్రకృతి వాతావరణంలో పెరిగిన తనకి చెట్ల ద్వారా మానవాళికి లాభాలేంటో పూర్తిగా తెలుసు. అప్పటికే అక్కడ కొన్ని ప్రాంతాల్లో చెట్లు లేని కారణంగా నీటివనరులు తగ్గుముఖం పట్టాయి. ఆ విషయాలన్నిటినీ భూస్వాములకి చెప్పుకొచ్చినా ఫలితం లేకపోయింది. పెద్ద ఎత్తున చెట్లని నరికి వేసే కార్యక్రమమొకటి అక్కడ మొదయిపోయింది. దీన్ని ఒక సవాలుగా తీసుకున్నాడు ఆంటోనియో. 1973లో సావ్ పావ్లో పట్టణ శివారు ప్రాంతంలో 31 హెక్టార్ల భూమిని కొనుగోలు చేసి ఆ భూమిలో మొక్కలు నాటడం ప్రారంభించాడు. అటవీ నిర్మూలనకి వ్యతిరేకంగా తను చేస్తున్న కృషిని అభినందించడంతోపాటు ఆధునిక వ్యవసాయాన్ని కూడా తన భూమిలో ప్రవేశ పెట్టేందుకు అప్పటి బ్రజిల్ సైనిక ప్రభుత్వం నిధులని కేటాయించింది. ఆంటోనియో వాటిని తిరస్కరించాడు. ఎందు కంటే తన లక్ష్యం వ్యవసాయం ద్వారా డబ్బు గడించడం కాదు. అటవీ పునరుధరణ ధ్యేయంగా వందలాదిగా చెట్లని నాటాడు. ఇదో తెలివితక్కువ ఆలోచనంటూ చుట్టుపక్కల వాళ్ళు ఆంటోనియోని తీవ్రంగా విమర్శించేవారు. ఆర్థిక లాభాల కంటే అటవీ నిర్మూలన ఎంత ప్రమాదకరమో అక్కడి వారికి తెలీదు. సాయంత్రాల్లో కొద్ది సేపు చెట్లని నాటడం మొదలు పెట్టిన తనకి ఇదే వ్యాపకం అయిపోయింది. నలభయ్యేళ్ళలో దాదాపు 50000కి పైగా మొక్కల్ని నాటాడు ఆంటోనియో. ఈ చెట్లనే తన కుటుంబంగా చెప్తుంటాడు. ఇప్పుడు ఆ వర్షారణ్యం ఇప్పుడు ఎన్నో రకాల జంతువులు, పక్షిజాతులకి ఆవాసంగా మారింది. సావ్ పావ్లో ప్రాంతంలో ఇప్పటి వరకూ ఎలాంటి విపత్కర పరిస్థితులు లేవంటే దానికి ఆంటోనియో కృషే కారణం..

గాజర్ మటర్ పులావ్



కావాల్సిన పదార్థాలు

బాస్మతి బియ్యం-2 కప్పులు
నెయ్యి 2 టేబుల్ స్పూన్లు
జీలకర్ర-1 టేబుల్ స్పూన్
అల్లం తరుగు-1టేబుల్ స్పూన్
క్యారెట్ ముక్కలు-1కప్పు
బఠాణీలు -1కప్పు
మినపప్పు-2 టేబుల్ స్పూన్లు
ధనియాల పొడి-2టేబుల్ స్పూన్లు
గరం మసాలా 1 టీ స్పూన్
ఉప్పు-రుచికి తగినంత
పసుపు-చిటికెడు

తయారుచేసే విధానం

ముందుగా బియ్యాన్ని కడిగి గంటసేపు నాననివ్వాలి. మినపప్పుని వేయించి కాస్త పలుకులుగా పొడి చేసుకోవాలి. ఇప్పుడు ప్యాన్‌పై నెయ్యి వేసి కాగాక జీలకర్ర, అల్లం తరుగు వేసి వేయించుకోవాలి. అందులో నానబెట్టిన బియ్యం, బఠాణీలు, క్యారెట్లు, మినపప్పు పొడి, ఉప్పు, గరంమసాలా, పసుపు అన్నీ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో నాలుగు కప్పుల నీరుపోసి బాగా ఉడికించుకోవాలి. ఈలోపు మరోప్యాన్‌పై కొద్దిగా నెయ్యి వేసి జీడిపప్పులని వేయించి పక్కన పెట్టుకోవాలి. అన్నం మిశ్రమం పూర్తిగా ఉడికిన తర్వాత వేయించిపెట్టుకున్న జీడిపప్పులతో గార్నిష్ చేసి వేడి వేడి పులావ్‌ని రుచి చూడండి.

గాజర్ హల్వా

కావాల్సిన పదార్థాలు

గాజర్ తరుగు-కిలో
పాలు-1/2 లీ
కండెన్స్‌డ్ మిల్క్-1/4 లీ
పంచదార-1 కప్పు
కెవ్రా ఎసెన్స్-నాలుగు చుక్కలు
నెయ్యి-1 కప్పు
డ్రై ఫ్రూట్స్-రుచికి సరిపడా



తయారుచేసే విధానం

నాన్‌స్టిక్ ప్యాన్‌లో పాలు పోసి గాజర్ తురుము వేసి పాలన్నీ ఆవిరైపోయేవరకూ ఉడికించుకోవాలి. తర్వాత పంచదార వేసి బాగా కలపాలి. పంచదార మొత్తం కరిగి నీరంతా ఇంకిపోయేవరకూ కలుపుతూ వుండాలి. తర్వాత అందులో నెయ్యి, కండెన్స్‌డ్ మిల్క్, డ్రై ఫ్రూట్స్ ముక్కలు వేసి మంచి వాసన వచ్చే వరకూ ఉడికించాలి. చివరిగా కెవ్రా కూడా కలిపి దించేయాలి. ఇప్పుడు సర్వింగ్ బౌల్స్‌లో హల్వాని వుంచి మరిన్ని బాదం పలుకులతో గార్నిష్ చేసి అతిథులకందించండి.

బాదం గాజర్ బర్ఫీ



కావాల్సిన పదార్థాలు

గాజర్ తురుము-1 కిలో
బాదం పాలు-1 లీ
యాలకులు-8
కర్జూరం పేస్ట్-3 టేబుల్ స్పూన్లు
కిస్‌మిస్-1 టేబుల్ స్పూన్
జీడిపప్పు పేస్ట్ -3 టేబుల్ స్పూన్లు
బాదం తరుగు- 1 టేబుల్ స్పూన్

బాదంపాల తయారీ

కప్పు బాదం పప్పుని చల్లని నీళ్లలో లేదా వేడి నీళ్ళలో వేసి పొట్టు తీయాలి. తరవాత బాదం పప్పులో లీటరు నీళ్ళు పోసి మిక్సీలో వేసి మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. కాస్త పల్చగా వచ్చేలా బ్లెండ్ చేసి నెట్టతో వడగట్టి పక్కనపెట్టుకోవాలి.

తయారుచేసే విధానం

ముందుగా ఖర్జూరాలని నాలుగు గంటల సేపు నీళ్ళలో నానబెట్టి ముద్దలా చేయాలి. జీడిపప్పుని కూడా ముద్దలా చేయాలి. ఇప్పుడు ఒక మందపాటి బాణలిలో నెయ్యి వేసి, క్యారెట్ తురుము వేసి వేయించుకోవాలి. తర్వాత బాదం పాలు పోసి యాలకులు వేసి పాలన్నీ ఆవిరైపోయేవరకూ అరగంట సేపు చిన్న మంటపై ఉడకనివ్వాలి. ఇప్పుడు ఖర్జూరం ముద్ద వేసి బాగా కలుపుకోవాలి. జీడిపప్పు ముద్ద కూడా వేసి మరోసారి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని గట్టిపడేవరకూ ఉడికించాలి. తర్వాత నెయ్యి రాసిన ప్లేట్‌లో ఈ మిశ్రమాన్ని వేసి పరచినట్లు చేయాలి. దీనిపై కిస్‌మిస్, బాదం, జీడిపప్పు తరుగు వేసి ఆరిన తర్వాత నచ్చిన ఆకారంలో ముక్కలుగా కట్ చేసుకుంటే గాజర్ బర్ఫీ రెడీ!

పదాలు గుర్తిద్దాం

ఇక్కడున్న స్కూల్ బస్‌లో కొన్ని అక్షరాలు ఉన్నాయి. కింద ఇచ్చిన పదాలు ఆ అక్షరాల్లో ఎక్కుడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.



ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని రకాల చేపలు వాటి నీడలు ఉన్నాయి. ఏ చేప నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.



తేడాలు గుర్తిద్దాం

ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.



కనిపెట్టండి

ఇక్కడ రెండు వరుసల్లో కొన్ని అగ్గిపుల్లల్ని వుంచాం. అయితే వేరువేరు ఆకారాల్లో వున్న ఆ అగ్గిపుల్లలతో మూడుచతుర్భుజాలని ఎలా చేయవచ్చో మీరే కనిపెట్టండి.



ఆకులతో బొమ్మ



బొమ్మను పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా ఒక బొమ్మని సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండే!



పేపర్ ప్లేట్ పీత



పిల్లలూ! మీకు బొమ్మలు తయారు చేయడమంటే భలే ఇష్టం కదూ... మీకోసం మనింటి వద్ద దొరికే వస్తువులతో పేపర్ ప్లేట్ క్రాబ్‌ని ఎలా తయారుచేసుకోవచ్చో మేం నేర్పిస్తాం. మీరూ ప్రయత్నించండి.

కావాల్సినవస్తువులు:
పేపర్‌ప్లేట్-1(మీడియం సైజ్), గూగుల్ ఐస్ -2(పెద్దవి), పైప్ క్లీనర్-3(ఎరుపు, గోధుమ రంగుల్లో), గమ్, కత్తెర, స్కెచ్ పెన్, కన్‌స్ట్రక్షన్ పేపర్-1(ఎరుపు రంగు), యాక్రిలిక్ పెయింట్ -1(ఎరుపురంగు), పెయింట్ బ్రష్-1(మీడియం సైజ్).

తయారుచేసే విధానం

ముందుగా ఎరుపు రంగు పైప్ క్లీనర్‌ని తీసుకుని రెండు సమాన భాగాలుగా కట్‌చేసి పెట్టుకోవాలి. తర్వాత గోధుమ రంగు పైప్‌క్లీనర్‌ని తీసుకుని ఆరు సమాన భాగాలుగా కత్తిరించాలి. ఎరుపు రంగు యాక్రిలిక్ పెయింట్ తీసుకుని బ్రష్‌తో బాగా కలపాలి. ఇప్పుడు పేపర్ ప్లేట్‌పై బ్రష్‌తో యాక్రిలిక్ పెయింట్‌ని వేసి కొద్దిసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత మరోసారి పెయింట్‌ని వేసి మరికొంత సేపు ఆరనివ్వాలి. కన్‌స్ట్రక్షన్ పేపర్‌ని తీసుకుని దానిపై బొమ్మలో చూపిన విధంగా స్కెచ్ పెన్‌తో పీత చేతుల భాగాన్ని గీయాలి. వాటిని కత్తెరతో జాగ్రత్తగా కట్‌చేసి పక్కన పెట్టుకోవాలి. ఎరుపు రంగు పైప్ క్లీనర్‌ని తీసుకుని ఒక చివరన గమ్‌తో చేతి భాగాన్ని అతికించాలి. అలా మరో చేయి భాగాన్నీ అతికించిన తర్వాత మరో చివరని పేపర్ ప్లేట్ అడుగు భాగంలో అతికించాలి. ఇప్పుడు గోధుమ రంగు పైప్ క్లీనర్‌లను తీసుకుని పేపర్ ప్లేట్‌కి ఇరువైపులా మూడిటిని అతికించాలి. చివరిగా గూగుల్ ఐస్‌ని తీసుకుని క్రాబ్ చేతి భాగానికి మధ్యగా పేపర్ ప్లేట్‌పై వాటిని అతికించాలి. ఇలా మీకు నచ్చిన రంగు పేపర్‌ప్లేట్స్‌తో క్రాబ్ బొమ్మని తయారుచేసుకోవచ్చు.

పదవికాసం - 65

కూర్పు: రావెళ్ళ

1	✿	2	3	✿	4		✿	5
6	7	✿		✿		✿	8	
✿	9	10		✿	11	12		✿
13	✿		✿	14	✿		✿	15
16		✿	17			✿	18	
	✿	19	✿		✿	20	✿	
✿	21		22	✿	23		24	✿
25		✿		✿		✿	26	27
	✿	28		✿	29		✿	

ఆధారాలు

అడ్డం

2. వర్షం (2)
4. నుయ్యి (2)
6. మోసం (2)
8. బేసికాదు (2)
9. పొట్టి (3)
11. అటు నుండి స్వప్నాలు (3)
16. ఉత్తరం (2)
17. మంచి పని (3)
18. శక్తి (2)
21. దృశ్యకావ్యం (3)
23. అల్మరా (3)
25. అభివృద్ధి (2)
26. ఒక టి.వి.యాంకర్ పేరు (2)
28. క్షీరము (2)
29. అటు నుండి చర్మం (2)

నిలువు

1. క్రీడ (2)
3. కన్నీరులో నీరు లేదు (2)
4. కత్తులు (3)
5. ఏనుగు (2)
7. తిరగబడ్డ పలుకు (2)
10. మట్టి (2)
12. తీగ (2)
13. ఒకసారి నోటిలో పోసుకుని మింగటం (3)
14. ఒక భాష (3)
15. హిందీ ఉపన్యాస్ (3)
19. చదునుగా ఉండే ఒక రకం రాయిలోని సగం (2)
20. విధం (2)
21. ఆకారం (2)
22. ఒక కాయ ధాన్యం (3)
23. చీలికలు (3)
24. వాసంతి, సుమతిలలో తొలి అక్షరాలు (2)
25. ఆరున్నొక్కటి (2)
27. రహస్యం (2)

సుడోకు

4	5		3	8		9	6	
	8				4		2	
	9	1	2			8		
	1	7				6		2
							5	
2	6			7		1	8	
1	4	5		3	9			
				5		3	9	
9								6

గతవారం జవాబులు

9	7	3	1	2	4	8	5	6
8	5	1	3	6	7	4	9	2
2	4	6	9	8	5	7	1	3
5	9	4	8	7	2	3	6	1
6	8	7	5	1	3	9	2	4
1	3	2	6	4	9	5	7	8
3	1	5	2	9	8	6	4	7
4	2	8	7	5	6	1	3	9
7	6	9	4	3	1	2	8	5

1 అ	వి	2 రా	మం	✿	3 ఉ	4 త్త	మా	5 ట
ల	✿	జీ	✿	6 దం	✿	అ	✿	కీ
7 స	తి	✿	8 ప	డ	గ	✿	9 ఇ	మ
ట	✿	10 ద	✿	కం	✿	11 ది	✿	ని
✿	12 మ	శ	కం	✿	13 ఆ	వి	రి	✿
14 అ	✿	మి	✿	15 వా	✿	టి	✿	16 పొ
17 ను	జ్జు	✿	18 మొ	ల	క	✿	19 ఎ	ర
రా	✿	20 పూ	✿	కం	✿	21 తె	✿	పా
22 గం	డు	చీ	మ	✿	23 గా	లి	కుం	టు



గాజు విశ్వం

విశ్వాన్ని ఓ గాజు గోళంలోకి నొక్కేశాడు జపాన్‌కు చెందిన సతోషి తోమిజు. 'స్పేస్ గ్లాస్' పేరిట నక్షత్ర మండలాల్ని, సౌర మండలాల్ని గాజుతో చేసేశాడు. అనంత విశ్వ దృశ్యాల్ని ఓ బుల్లి గాజు గోళంలో కూర్చిన ఇతడి నేర్పుకి అటెలీర్ నోవా డిజైన్ అవార్డు కూడా వచ్చింది. వీటిని పెండెంట్‌లుగా అలంకరించుకోవచ్చు. బంగారం, ఓపల్స్ ముక్కలపై గాజుతో లూప్‌లు వేసి ఈ అద్భుతాన్ని సృజించాడు. ఉష్ణ నిరోధక గాజు కళపై అతడు పట్టు సాధించాడు. వాటితో అలంకరణ వస్తువులను తయారుచేసే సతోషికి విశ్వ దృశ్యం అబ్బురపరిచింది. పాలవెల్లిని గాజు గోళంతో తయారుచేయాలని చాలా ఆలోచించాడు. రంగు గాజుల లూప్‌తో బ్యాక్‌గ్రౌండ్ ఇవ్వొచ్చు గానీ చిన్నపాటి మెరిసే నక్షత్రాల్ని, గ్రహాల్ని ఎలా ఏర్పాటు చేయాలనే దానిపై పెద్ద కసరత్తే చేశాడు. అందుకు స్వర్ణాన్ని, జాతి రత్నాల ముక్కలను తీసుకున్నాడు. ఇలా సతోషి ఆవిష్కరించిన గాజు విశ్వంలోకి మీరూ తొంగి చూడండి.





జలతారు ధారలు



కాడిజ్, స్పెయిన్



ఓహియో, అమెరికా



కొలరాడో స్ప్రింగ్స్

జల విన్యాసాల్ని ధారకడతాయి ఫౌంటెన్‌లు. అ:తపురాల్లో, ఉద్యానవనాల్లో రంగురంగుల్లో, ఆకారాల్లో నీరు ఎగజిమ్ముతూ చూపు తిప్పుకోనివ్వవు. అరుదైన, పురాతన కట్టడాల ముందు, ప్రాచీన నగరాల వీధి మధ్యనే కాదు ఇప్పుడు అనేక పర్యాటక ప్రాంతాల్లో అవే ప్రత్యేక సందర్శన ప్రాంతాలవుతున్నాయి. ఒకప్పుడే కాదు ఇప్పుడూ వాటి విన్యాసాల్లో తడిసిముద్దయి కేరింతలు కొడుతుంటారు. ప్రపంచంలోనే అత్యద్భుతమైన ఫౌంటెన్‌లలో కొన్ని ఇవే. నీటి పడవలు, జలపాతాల వంతెనలు, సలిల బాటలు ఇలా వింతైన కృత్రిమ నీటి బుగ్గల్లా రూపొందించారు. పండు వెన్నెలలా నీటిని వెదజల్లేవి కొన్నయితే పంచె వన్నెల్లో ఇంద్రధనువును విరిచేవి మరికొన్ని.





బాన్పో బ్రిడ్జి (సియోల్, కొరియా)



లిమా, పెరూ



ది డైవర్స్ ఫౌంటెన్ (దుబాయ్)

వలెన్షియా, స్పెయిన్

Check List

Book Number	KN8R02B172	**Date**	3/09/22
Front Cover	yes	**Back Cover**	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Lakshmi	**Cutting By**	Lakshmi
Scanned By	pradyumna	**Pages**	99